teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 226 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 17 డిసెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ' 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## భూమిలేనివారికి రూ.6 వేలు.. రాష్ట్ర కేబినెట్ నిర్ణయం

రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం

5 గంటలకు పైగా కేబినెట్ చర్చ

02






# కేటీఆర్ మెడకు చుట్టుకోనున్న ఈ-ఫార్ములా రేసు..?

**రూ.55 కోట్ల చెల్లింపులో అవకతవకల ఆరోపణలు**

**ఏసీబీకి లేఖ రాయనున్న సీఎస్**

**వెంటనే లేఖ రాయాలని సీఎస్‌ను కేబినెట్ ఆదేశం**




తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): గత ప్రభుత్వ హయాంలో ఈ-ఫార్ములా రేసు కోసం విదేశీ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా నిధులు బదలాయించారన్న కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ-ఫార్ములా రేసు నిధుల బదలాయింపుపై విచారణకు గవర్నర్ ఆమోదం తెలిపారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. న్యాయనిపుణుల సలహాలు తీసుకుని గవర్నర్ ఆమోదం తెలిపారని సీఎస్ ద్వారా

మిగతా 2 లో

## ఇంటర్ పరీక్షలు షెడ్యూల్ విడుదల

**మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు**


**ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ప్రాక్టికల్స్**



తెలంగాణ ఇంటర్ పరీక్షలు షెడ్యూల్ వచ్చేసింది. 2025 మార్చి 5వ తేదీ నుంచి 25 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగనున్నాయి. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 22 వరకు ప్రాక్టికల్స్ జరుగనున్నాయి. జనవరి 29వ తేదీన ఇంటర్ ఎథిక్స్ అండ్ హ్యుమన్ వాల్యూస్ ఎగ్జామ్ ఉండనుంది.

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): ఈ మేరకు తెలంగాణ ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య సోమవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. మరోవైపు ఇప్పటికే సిలబస్ పూర్తి చేయడంపై ఫోకస్ పెట్టిన ఇంటర్ బోర్డు.. పరీక్షల షెడ్యూల్ ఇచ్చి రివిజన్‌కి వెళ్లే పనిలో పడింది. మరోవైపు పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంటర్, టెన్త్ పరీక్షల షెడ్యూల్ ఇవ్వడంతో తెలంగాణలో ఎప్పుడు ఇస్తారనే ఉత్కంఠకు కూడా తెరవీడింది. దీంతో వేగవంతంగా ఇంటర్ పరీక్షలు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

## సర్టిఫికెట్స్ కోసం మై-పంచాయతి యాప్




**త్వరలో అందుబాటులోకి యాప్.. గ్రామ సేవలు సులభం**

**ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు**

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యం మేరకు సాంకేతికతను వినియోగిస్తూ, వివిధ ధ్రువీకరణ పత్రాలు మరియు సర్వీసుల కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తోంది. జన్మ ధ్రువీకరణ పత్రం, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు 20 రకాల సేవలను ఈ యాప్ ద్వారా పొందే అవకాశం

మిగతా 2 లో




## జనవరి 1 నుండి యూపీఐ ట్రాన్సాక్షన్స్‌కి కొత్త రూల్స్

**యూపీఐ 123 పేమెంట్స్ లిమిట్ పెంపు**


తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): జనవరి 1, 2025 నుండి యూపీఐ ట్రాన్సాక్షన్స్ కి సంబంధించిన కొత్త రూల్స్ అమలు కానున్నాయి. ఈ విషయాన్ని ఆర్బీఐ ప్రకటించింది. యూపీఐ 123 పేమెంట్స్ లిమిట్ కూడా పెంచారు. అవి కూడా జనవరి 1 నుంచి వినియోగదారులు ఉపయోగించుకోవచ్చని ఆర్బీఐ

మిగతా 2 లో

## సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులపై అసెంబ్లీలో వాడీ వేడీ చర్చ

**హరీష్ రావు, మంత్రి సీతక్కల మధ్య ప్రశ్నల వర్షం**

**హరీష్ రావు వర్సెస్ సీతక్క వాదనలతో దద్దరిల్లిన అసెంబ్లీ**



హైదరాబాద్, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ

మిగతా 2 లో



## బీసీ గురుకుల పాఠశాలల ఏర్పాటుపై ప్రభుత్వం నిర్లక్ష్యం

**కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శలు**

హైదరాబాద్, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క బీసీ గురుకుల పాఠశాలను కూడా ఏర్పాటు చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. కనీసం గురుకులాలను ఏర్పాటు చేయాలనే ఆలోచన

మిగతా 2 లో

## డిసెంబర్ 18న చలో రాజ్ భవన్

**ఈ మేరకు గాంధీభవన్ వర్గాల వెల్లడి**



.. వివరాలు 2లో

## జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తాం

**ఉద్యోగాల భర్తీపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం**

హైదరాబాద్, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): నోటిఫికేషన్ వేయడం అంటే ఉద్యోగం ఇవ్వడం కాదని గత పాలకుల విధానమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఉద్యోగాల భర్తీపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 55,172 ఉద్యోగాలు భర్తీ చేశామని

మిగతా 2 లో



## ఏ జిల్లాను ప్రభుత్వం రద్దు చేయబోమ్

**ప్రకటించిన మంత్రి పొంగులేటి**

**బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని ఫైర్**



హైదరాబాద్, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక రాష్ట్రంలో జిల్లాల సంఖ్యను కుదిస్తారనే ప్రచారం జోరుగా జరుగుతోంది. ఈ క్రమంలోనే సోమవారం

మిగతా 2 లో

## అసెంబ్లీ సమావేశాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాకౌట్

**ప్రభుత్వ విధానాలకు నిరసనగా నేడు రాష్ట్ర వ్యాప్త నిరసనలు**

**రైతన్నలపై అక్రమ కేసుల ఎత్తివేతకు డిమాండ్**



.. వివరాలు 2లో



## కొత్త రేషన్ కార్డుల జారీపై మంత్రి ఉత్తమ్ ప్రకటన

**ఒక్కొక్కరికి 6 కిలోల సన్న బియ్యం పంపిణీ**

**సంక్రాంతి తర్వాతే జారీ చేయనున్నట్లు వెల్లడి**

హైదరాబాద్, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల జారీపై ప్రభుత్వం శుభవార్త తెలిపింది. సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర సివిల్ సప్లయ్స్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

మిగతా 2 లో

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీల ఆందోళనతో శాసన మండలి వాయిదా

**రైతులకు బేడీలు అంశంపై చర్చించాలని సభ్యులు డిమాండ్**


**జై జవాన్ జై కిసాన్ అంటూ శాసన మండలి ముందు నినాదాలు**




.. వివరాలు 2లో

# కేటీఆర్ మెడకు చుట్టుకోనున్న ఈ-"ఫార్ములా" రేసు..?




మొదటి పేజీ తరువాయి

ఏసీబీకి లేఖ పంపుతామని ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమంలో నేడు ఏసీబీకి సీఎస్ లేఖ రాయనున్నారు. ఏసీబీకి వెంటనే లేఖ రాయాలని సీఎస్‌ను కేబినెట్ ఆదేశించింది. ఈ రేసింగ్ ఏజెన్సీ, నిర్వాహకులకు కూడా నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. ఈ-ఫార్ములా రేసు కేసులో మంత్రి కేటీఆర్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు విచారించేందుకు రాష్ట్ర సర్కారు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను అనుమతి కోరుతూ లేఖ రాయగా గవర్నర్ ఆమోదం తెలిపారు. కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతి మంజూరు చేశారు. ఏసీబీ అధికారులు త్వరలోనే నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇక, 2023 ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో ఈ-ఫార్ములా కారు రేసు నిర్వహణకు సంబంధించిన రూ.55 కోట్ల చెల్లింపులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు ఉన్న విషయం తెలిసిందే. ఈ కేసులో కేటీఆర్ విచారణకు సంబంధించి దాదాపు నెల రోజుల క్రితమే గవర్నర్ నుంచి రాష్ట్ర సర్కారు అనుమతి కోరింది. కేటీఆర్ విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌కు పదేపదే విజ్ఞప్తి చేశారు. అయితే న్యాయ సలహా తీసుకున్న తర్వాత ఇందుకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం తెలిపారు. దీంతో ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఏసీబీ ఇప్పుడు గతంలో మంత్రిగా ఉన్న కేటీఆర్‌పై తన దర్యాప్తును కొనసాగించవచ్చు. ఇందులో కేటీఆర్‌తో పాటు అప్పుడు హెచ్ఎండీఏ కమిషనర్‌గా ఉన్న కార్యదర్శి అరవింద్ కుమార్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి.

## సర్టిఫికెట్స్ కోసం "మై-పంచాయతి" యాప్

మొదటి పేజీ తరువాయి

కల్పించనున్నారు. గ్రామీణ ప్రజలకు పంచాయతీ సేవలను సులభతరం చేయడమే ఈ యాప్ ప్రధాన ఉద్దేశ్యంగా ఉంది. తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న మై-పంచాయతి యాప్ ద్వారా పంచాయతీ పరిధిలోని పలు రకాల సేవలను ఆన్లైన్లో పొందొచ్చు. ఇందులో బర్త్ సర్టిఫికేట్, డెత్ సర్టిఫికేట్, మ్యారేజ్ సర్టిఫికేట్, హౌజ్ పర్మిషన్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి ముఖ్యమైన సేవలు అందించబోతున్నారు. ఈ యాప్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవలు మరింత చేరువవుతాయి. గ్రామాల్లో తలెత్తే సమస్యలను నివేదించడానికి ఈ యాప్ ఉపయోగకరంగా ఉండబోతుంది. ప్రజలు తమ సమస్యలను ఫిర్యాదు రూపంలో పంపించవచ్చు. తద్వారా సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయి. ప్రజల అభ్యర్థనలు నేరుగా సంబంధిత అధికారులకు చేరేలా ఈ యాప్ పనిచేస్తుంది. ఈ యాప్ ద్వారా ప్రజలు ఎక్కడి నుంచైనా సేవలను పొందగలరు. దరఖాస్తు చేసుకున్న పత్రాలను డౌన్లోడ్ చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పత్రాల కోసం వేచి ఉండే అవసరం లేకుండా ప్రజలు సమయాన్ని మరియు శ్రమను ఆదా చేసుకోగలుగుతారు. ఈ యాప్‌ను తెలంగాణ ప్రభుత్వం త్వరలో అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఈ ప్రయత్నం గ్రామీణ ప్రజల జీవితాల్లో మార్పుని తీసుకురావడమే కాకుండా, ప్రభుత్వం-ప్రజల మధ్య అవగాహనను పెంపొందించడానికి దోహదపడుతుంది. పంచాయతీ సేవలను డిజిటలైజ్ చేయడం తెలంగాణ సర్కార్ ముందుచూపుని తెలియజేస్తోంది.

## జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తాం



మొదటి పేజీ తరువాయి

ఇందులో 54,573 మందికి నియామక ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ను ప్రక్షాళన చేసి జాబ్ క్యాలెండర్ విడుదల చేసినట్టు తెలిపారు. గత పది సంవత్సరాలపాటు ఉద్యోగ నియామకాలు లేక యువకులు అల్లాడిపోయారని ఉద్యోగాల కోసం యువత ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నారని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం తెచ్చుకున్నదే ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువత ఉద్యోగాలు పొంది జీవితంలో స్థిరపడాలనేదే మా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. మా ప్రభుత్వం ఏర్పడిన కొద్ది సమయంలోనే 55 నుంచి 56 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. గత పాలకులు పదేళ్ల కాలంలో గ్రూప్ వన్ పరీక్ష ఒక్కసారి కూడా నిర్వహించలేకపోయారు, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదు అన్నారు. మేము అధికారంలోకి రాగానే పాత ఖాళీలు కొత్తవి కలిపి గ్రూప్ వన్ నోటిఫికేషన్ విడుదల చేశాము. ఈ పరీక్షలను ఆపాలని కావాలనే కొద్దిమంది కోర్టుకు వెళ్లారు కానీ మేము ఇచ్చిన మాట ప్రకారం 563 పోస్టులకు పరీక్ష నిర్వహించాము, 11062 ఖాళీలతో డీఎస్సీ నిర్వహించి 10, 600 మందికి అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇచ్చామని తెలిపారు. ఉద్యోగ నియామక పరీక్షలన్నీ పారదర్శకంగా, ప్రశ్నాపత్రం లీక్ వంటివి లేకుండా చూసుకుంటూ ఖాళీలను భర్తీ చేసుకుంటూ పోతున్నామని వివరించారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలు జాబ్ క్యాలెండర్ ప్రకారం దశలవారీగా భర్తీ చేసుకుంటూ ముందుకు పోతాం అన్నారు. ఉర్దూ మీడియం లో బ్యాక్లాగ్ పోస్టుల భర్తీకి డీ రిజర్వేషన్ విధానం పరిశీలించాలని కొందరు సభ్యులు అడిగారు కానీ అందుకు అవకాశం లేదని తెలిపారు.

## సర్పంచ్ ల పెండింగ్ బిల్లులపై అసెంబ్లీలో వాడీ వేడీ చర్చ



మొదటి పేజీ తరువాయి

సందర్భంగా సర్పంచ్ ల పెండింగ్ బిల్లులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హరీష్ రావు అడిగిన ప్రశ్నకు మంత్రి సీతక్క సమాధానమిస్తూ పదేళ్ల బీఆర్ఎస్ పాలన పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. దీంతో హరీష్ రావు వర్సెస్ సీతక్క వాదనలతో అసెంబ్లీ దద్దరిల్లింది. సర్పంచ్‌లకు చెల్లించాల్సిన రూ.691 కోట్లు గత ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని హరీష్ రావు గుర్తు చేశారు. నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిస్తే ఎక్కడికక్కడ సర్పంచ్ లను అరెస్టు చేశారని తెలిపారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించింది బడా కాంట్రాక్టర్లకు అన్నారు. బడా కాంట్రాక్టర్లకు రూ. 1200 కోట్లు.. చిన్న కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు మాత్రం ఒక్క పైసా కూడా అందలేదని తెలిపారు. పంచాయతీ ఎన్నికలకు ముందు పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని, ఎప్పుడు క్లియర్ చేస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. అనంతరం హరీష్ రావు అడిగిన ప్రశ్నకు మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు. పదేళ్ల బీఆర్ ఎస్ పాలనలో పంచాయతీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. 2014 నుంచి సర్పంచ్ ల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని, గత ప్రభుత్వం ఆ బిల్లులు ఎందుకు చెల్లించలేకపోయిందో సమాధానం చెప్పాలన్నారు.
సర్పంచ్ బిల్లుల గురించి అప్పట్లో ఆర్థిక మంత్రిగా ఉన్న హరీశ్ రావుకు తెలియదా అని ప్రశ్నించారు. ఈ రోజు తమకేమీ తెలియనట్లు బీఆర్ఎస్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పల్లె ప్రగతి నిధులు విడుదల చేయకపోవడంతో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఎదురుదాడికి దిగారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ ల పెండింగ్ బిల్లులపై మంత్రి సీతక్క సరైన సమాధానం చెప్పలేదని బీఆర్ ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. వాకౌట్ అనంతరం తిరిగి అసెంబ్లీకి చేరుకున్న బీఆర్ఎస్ నేతలు ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు.

## జనవరి 01 నుండి యూపీఐ ట్రాన్సాక్షన్స్ కి కొత్త రూల్స్

మొదటి పేజీ తరువాయి

ప్రకటించింది. కొత్త రూల్స్, అప్డేషన్స్ కి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. డిజిటల్ ట్రాన్సాక్షన్స్ పల్లెల్లోకి కూడా వచ్చేశాయి. చదువు లేని వాళ్లు కూడా స్మార్ట్ ఫోన్లు ఉపయోగించడం, యూపీఐ లావాదేవీలు చేయడం నేర్చుకొని మరీ ట్రాన్సాక్షన్స్ చేస్తున్నారు. ఇప్పటికే ప్రతి వస్తువు కొనుగోలు ఫోన్ పే, గూగుల్ పే లను ఉపయోగించి చేస్తున్నారు. కరెన్సీ వాడకం చాలా వరకు తగ్గిపోయింది. డిజిటల్ లావాదేవీలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఆర్బీఐ ఇప్పటికే కొత్త నియమాలు ప్రకటించింది. అవన్నీ కొత్త సంవత్సరం 2025లో జనవరి 1 నుంచి అమలు కానున్నాయని ఇటీవల ఆర్బీఐ ప్రకటించింది. జనవరి 1 నుండి యూపీఐ 123 చెల్లింపు లావాదేవీల పరిమితి పెరిగింది. ప్రస్తుతానికి యూపీఐ చెల్లింపు పరిమితి రూ.5,000 గా ఉంది. జనవరి 1 నుంచి రూ.10,000 వరకు ట్రాన్సాక్షన్ చేయవచ్చు. ఆర్బీఐ ఇప్పటికే ఈ కొత్త నియమాన్ని ప్రకటించినప్పటికీ బ్యాంకులు, సర్వీస్ ప్రొవైడర్లు ఈ నియమాలను పాటించి, కస్టమర్లకు సేవలందించడానికి గడువు తీసుకున్నారు. ఇప్పుడు జనవరి 1 నుంచి రూ.10,000 వరకు లిమిట్ పెంపు సౌకర్యం కూడా అమలుకానుంది. జనవరి 1 నుండి యూపీఐ చెల్లింపు పరిమితులే కాదు.. మరికొన్ని కొత్త రూల్స్ కూడా అమలులోకి వస్తున్నాయి. యూపీఐ 123 పే ద్వారా జరిగే లావాదేవీలకు సర్వీస్ ఛార్జీలు ఇకపై ఉండవు. ఇది ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన విషయం. ఈ ఫీచర్ ఫోన్‌లలో డిజిటల్ చెల్లింపులను సులభతరం చేస్తుంది. వినియోగదారులు ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండా యూపీఐ సేవలను యాక్సెస్ చేయడానికి వీలు కల్పిస్తుంది. అంటే ఐవీఆర్ ద్వారా చెల్లింపులు చేయవచ్చు. జనవరి 1 నుండి అమలులోకి రానున్న మరో కొత్త రూల్ ఏంటంటే పాన్ కార్డ్‌తో ఆధార్ కార్డ్ లింక్ చేయడం తప్పనిసరి చేశారు. పాన్ కార్డ్‌తో ఆధార్ లింక్ చేయకపోతే పాన్ కార్డ్ నిలిపివేస్తారు. పాన్ కార్డ్ నిలిపివేస్తే ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఏ సేవలనూ పొందలేరు.

## అసెంబ్లీ సమావేశాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాకౌట్



హైదరాబాద్, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): అసెంబ్లీ సమావేశాల నుంచి వాకౌట్ చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కీలక నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు నిరసనగా మంగళవారం రోజున తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు చేయాలని నిర్ణయించారు. లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించిన విధానాలకు నిరసనగా మంగళవారం అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు ఇవ్వబోతున్నారు. ఈ విషయాన్ని మీడియాకు తెలియజేశారు. అంతేకాదు రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరోవైపు అసెంబ్లీలో జరుగుతున్న బీఏసీ సమావేశాల నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. సభ ఎన్నిరోజులు నడుపుతారు అనేదానిపై కాంగ్రెస్ నేతలు క్లారిటీ ఇవ్వకపోవడంతో సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఎమ్మెల్యే హరీశ్ రావు వెల్లడించారు. వీరితో పాటుగా ఎంఐఎం నేతలు కూడా సభ నుంచి వాకౌట్ చేశారు.

## కొత్త రేషన్ కార్డుల జారీపై మంత్రి ఉత్తమ్ ప్రకటన

మొదటి పేజీ తరువాయి

మండలిలో వెల్లడించారు. ఈసారి జారీ చేసే రేషన్ కార్డులు స్మార్ట్ కార్డుల రూపంలో ఉండనున్నాయని ఆయన తెలిపారు. అలాగే రేషన్ కార్డులో చిప్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ చిప్ లో కుటుంబసభ్యుల పూర్తి వివరాలను పొందుపొరుస్తామని అన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీ సమయంలో ఒక్కొక్కరికి 6 కిలోల సన్న బియ్యాన్ని అందజేస్తామన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఈసారికి కార్డులు జారీ చేసినప్పుడు అదనపు కార్డులు ఇవ్వడమే కాకుండా స్మార్ట్ కార్డులు ఇస్తాం. అందులో మైక్రో చిప్ ఉంటుంది. అందులో కుటుంబసభ్యుల పూర్తి సమాచారం ఉంటుంది. రేషన్ కార్డు పొందేందుకు ఇప్పుడు ఏయే అర్హతలు ఉన్నాయో రాబోయే రోజుల్లోనూ వాటినే కొనసాగిస్తాం. ఎలక్ట్రానిక్ చిప్ తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేస్తాం. తెలంగాణలోని కుటుంబాలకు ఈ విషయం చెప్పడానికి నాకు చాలా ఆనందంగా ఉంది. సంక్రాంతి తర్వాత రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలు పెడతాం. అదే విధంగా ఒక్కొక్కరికి 6 కిలోల సన్నబియ్యం ఇవ్వాలని నిర్ణయించాం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## భూమిలేనివారికి రూ.6 వేలు.. రాష్ట్ర కేబినెట్ నిర్ణయం



హైదరాబాద్, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దాదాపు 5 గంటలకు పైగా కేబినెట్ సమావేశం జరిగింది. డిసెంబర్ 28న భూమిలేనివారికి రూ.6 వేలు ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ చేసేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. కేటీఆర్ ఈ-ఫార్ములా రేస్ నిధుల బదలాయింపుపై విచారణకు గవర్నర్ ఆమోదం తెలిపారని ప్రభుత్వం వెల్లడించింది. న్యాయనిపుణుల సలహాలు తీసుకుని గవర్నర్ ఆమోదం తెలిపారని సీఎస్ ద్వారా ఏసీబీకి లేఖ పంపుతామని ప్రభుత్వం పేర్కొంది. కేటీఆర్ ను అరెస్టు చేస్తే రాష్ట్రం అగ్నిగుండం అవుతుందనడం వారి అహంకారపురిత మాటలకు నిదర్శనమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్షంగా విమర్శలు చేయడంలో తప్పు లేదన్నారు. కక్ష పూరితంగా కాంగ్రెస్ వ్యవహరించడం లేదని తప్పులను బయటకు తీసి చర్చలో పెట్టామని మంత్రి పేర్కొన్నారు. ఐఏఎస్ అరవింద్ కుమార్‌పై కూడా చర్యలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీల ఆందోళనతో శాసన మండలి వాయిదా

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): తెలంగాణ శాసన మండలి రేపటికి వాయిదా పడింది. లగచర్ల రైతులకు బేడీలు వేసిన అంశంపై చర్చ చేపట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీల ఆందోళన నేపథ్యంలో సభను వాయిదా వేస్తూ మండలి ఛైర్మన్ నిర్ణయం తీసుకున్నారు. పర్యాటక విధానంపై శాసన మండలిలో సోమవారం స్వల్పకాలిక చర్చ జరిగింది. అయితే లగచర్ల రైతులకు బేడీలు వేసిన అంశంపై చర్చ చేపట్టాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. చర్చకు అనుమతించాలని ప్లకార్డులు పట్టుకుని నిరసనలు తెలిపారు. జై జవాన్.. జై కిసాన్ అంటూ నినాదాలు చేశారు. అయినప్పటికీ లగచర్ల రైతుల అంశంపై చర్చకు అనుమతించలేదు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ సభ్యుల ఆందోళనల నేపథ్యంలో శాసన మండలిని రేపటికి వాయిదా వేశారు. దీంతో మండలి ఛైర్మన్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ సభ్యులు ధర్నాకు దిగారు.

## బీసీ గురుకుల పాఠశాలల ఏర్పాటుపై ప్రభుత్వం నిర్లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

కూడా ప్రభుత్వానికి లేకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేవలం19 బీసీ సంక్షేమ పాఠశాలలను మాత్రమే ఏర్పాటు చేసిందని తెలిపారు. కానీ పదేండ్లలో కేసీఆర్ 275 బీసీ పాఠశాలలను, 31 బీసీ డిగ్రీ కాలేజీలను, ప్రత్యేకంగా బీసీలకు రెండు వ్యవసాయ కాలేజీలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. బీసీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.14వేల కోట్లు విడుదల చేసిందని చెప్పారు. దీని ద్వారా 15 లక్షల విద్యార్థులకు లబ్ది జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా కొత్త బీసీ గురుకులాలు ఏర్పాటు చేయలేకపోవడం బాధాకరమని అన్నారు. కేసీఆర్ హయాంలో 2230 బీసీ విద్యార్థులకు విదేశీ విద్య కింద రూ. 450 కోట్లు ఖర్చు చేశామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం విదేశీ విద్యకు ఎలాంటి ప్రోత్సహకాలు అందించలేదని చెప్పారు. ఎందుకు ఇంత ఆలస్యమవుతుందని కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీశారు. గురుకులాల్లో మెనూ మార్చామని చెబుతున్నారని కానీ ఇంకా స్కూల్స్‌లో ప్రారంభించలేదని అన్నారు. కొత్త మెనూను ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అయ్యాక రేవంత్ రెడ్డి నెలకు రెండు మూడు సార్లు ఢిల్లీకి వెళ్లారని కవిత అన్నారు. ఢిల్లీకి వెళ్లి కేంద్రమంత్రులను కలిసిన రేవంత్ రెడ్డి జిల్లాకొకటి రావాల్సిన నవోదయ విద్యాలయాలను ఎన్ని సాధించారని ప్రశ్నించారు. వెనుకబడిన జిల్లాలకు నిధులు సాధించారా అని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూ అదనంగా ఎన్ని నిధులు తీసుకొచ్చారని ప్రశ్నించారు.

## డిసెంబర్ 18న చలో రాజ్ భవన్



హైదరాబాద్, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): డిసెంబర్ 18న ఉదయం 11 గంటలకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో చలో రాజ్ భవన్ కార్యక్రమం చేపట్టనున్నట్లు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. నెక్లెస్ రోడ్ లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద భారీ జన సమీకరణతో రాజ్ భవన్ వరకు ప్రదర్శనగా చలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రదర్శనలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇంచార్జ్ దీపా దాస్, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పాల్గొంటారు. అమెరికాలో గౌతమ్ ఆధానీపై వచ్చిన ఆర్థిక అవకతవకలు వ్యాపార, ఆర్థిక రంగాలలో దేశ పరువును దెబ్బతీసాయని ఆధానీపై ఆర్థిక అవకతవకలు, నేరారోపణలు, అవినీతి, మోసం, మని లాండరింగ్, మార్కెట్ మనిపులేషన్ లాంటి అంశాలలో ఆయనపై ఆరోపణలు దేశ ప్రతిష్టను దెబ్బతీసాయని.. అలాగే మణిపూర్ లో వరుసగా జరిగిన అల్లర్లు, విధ్వంసాలపై మోదీ ఇప్పటి వరకు అక్కడకు వెళ్లకపోవడంలాంటి అంశాలపై ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం నాడు చలో రాజ్ భవన్ కార్యక్రమం చేపట్టినట్లు ప్రకటన ద్వారా తెలిపారు.

## ఏ జిల్లాను ప్రభుత్వం రద్దు చేయబోమ్



మొదటి పేజీ తరువాయి

శాసన మండలిలో ఓ సభ్యుడు జిల్లాల కుదింపుపై ప్రశ్న వేయగా అందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమాధానమిచ్చారు. తెలంగాణలో ఏ జిల్లాను ప్రభుత్వం రద్దు చేయబోదని ప్రకటించారు. పాత జిల్లాలను రద్దు చేయాలన్న ఆలోచన తమకు ఏమాత్రం లేదని అన్నారు. పదేళ్లు అధికారంలో బీఆర్ఎస్ మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని ఫైర్ అయ్యారు. నేడు ఆ అప్పులను తీరుస్తునే రాష్ట్రంలో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం వద్దకు నిధుల కోసం తరచుగా వెళ్తాయని వెళ్లిన ప్రతిసారీ నిధులు రావని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్ని నిధులు వచ్చాయో అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సర్కార్ పేదల ప్రభుత్వమని రాష్ట్ర సమగ్రాభివృద్ధే తమ ధ్యేయమని మంత్రి పొంగులేటి అన్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక


## మళ్లీ ఎన్నికలు తప్పవా

దేశంలో రాజకీయ వ్యవస్థ అన్నింటికి ఆటంకంగా మారుతోంది. ఒకప్పుడు చాలా దేశాలకన్నా ముందు ఉన్న మన దేశం.. ఇప్పుడు మాత్రం వెనుకబడింది. దీనికి కారణం రాజకీయాలు.. తరచూ ఎన్నికలు జరగడమే. ఒప్పుడు వెనుకబడిన చైనా.. ఒకే పార్టీ అధికారంలో ఉండడంతో అభివృద్ధిలో దూసుకుపోతోంది. దీంతో మన దేశ అభివృద్ధికి ఆటంకం రాజకీయాలే అని చాలా మంది భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ కూడా దీనినే నమ్ముతున్నారు. ఈ క్రమంలోనే వన్ నేషన్, వన్ ఎలక్షన్‌ను తెరపైకి తెచ్చారు"వన్ నేషన్ వన్ ఎలక్షన్" అమలు కోసం రాజ్యాంగాన్ని సవరించడానికి కనీసం ఆరు బిల్లులు పాస్ చేయాల్సి ఉంటుందని రాజకీయ నిపుణులు చెబుతున్నారు. అయితే దానికి ప్రభుత్వానికి పార్లమెంటులో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం ఉంటుంది. పార్లమెంటు ఉభయ సభల్లో ఎన్‌డీఏకు సాధారణ మెజారిటీ ఉన్నప్పటికీ, ఏ సభలోనూ మూడింట రెండొంతుల మెజారిటీ సాధించడం చాలా కష్టతరమైన పనే చెప్పాలి. జమిలి ఎన్నికలకు సంబంధించి గతంలో కోవింద్ కమిటీ సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కొనసాగుతోన్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. కేంద్రం జమిలికే మొగ్గు చూపుతుండడంతో దీని కోసం ఉన్న అడ్డంకులన్నీ తొలగించుకునేందుకు సమాయత్తం అవుతోంది. మొత్తం 2 దశల్లో ఎన్నికలు జరగనుండగా.. తొలి దశలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు.. అవి పూర్తైన 100 రోజుల్లోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయి. దీని కోసం దేశవ్యాప్తంగా ఒకే ఓటరు జాబితా ఉపయోగించనున్నారు. జమిలి ఎన్నికలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతోన్న వేళ.. దీనిపై ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. విస్తృత సంప్రదింపుల కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఈ బిల్లుకు సిఫార్సు చేయాలని సర్కారు యోచిస్తున్నట్లు సమాచారం. దీని ద్వారా వివిధ రాష్ట్రాల శాసనసభ స్పీకర్లతోనూ సంప్రదింపులు జరిపేందుకు ప్రభుత్వం ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అన్ని భాగస్వామ్య పక్షాలకు అవకాశం కల్పించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పార్లమెంట్ నుంచి పంచాయతీ వరకూ అన్ని ఎన్నికలనూ ఒకేసారి నిర్వహించడంపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో రూపొందించిన నివేదికను భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఈ ఏడాది మార్చిలో అందించారు. అనంతరం కోవింద్ కమిటీ ఇచ్చిన సిఫార్సులకు కేంద్ర మంత్రివర్గం ఈ సెప్టెంబరులోనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాజా పార్లమెంట్ సమావేశాల్లోనే ఈ బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టాలని భావిస్తోన్న ప్రభుత్వం.. తాజాగా కేంద్ర కేబినెట్‌లో ఆమోద ముద్ర వేసింది. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల ప్రతిపాదనలను 30కి పైగా పార్టీలు సమర్థించగా.. కాంగ్రెస్ సహా 15 పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. అయితే, ఈ ప్రతిపాదన ఆచరణాత్మకమైనది కాదని కాంగ్రెస్ పేర్కొంటోంది. తమ పార్టీ జమిలి ఎన్నికలకు మద్దతివ్వడం లేదని, ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఎన్నికలు నిర్వహించాలని వాదిస్తోంది. ఇక ఎన్నికల వ్యయం పెరుగుతుండడంతో నేతలు అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్నారు. అడ్డదారులు తొక్కుతున్నారు. ఎన్నికల కోసమే డబ్బులు పోగుచేసుకుంటున్నారు. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు ఎన్నికయ్యే నేతల్లో చాలా మంది ఇప్పుడు సంపాదనే లక్ష్యంగా పోటీ పాలన సాగిస్తున్నారు. దీంతో రాజకీయాలు కాస్ట్‌లీ అయిపోయాయి. దీంతో నేతలు అవినీతి సొమ్మునే ఎన్నికల్లో ఖర్చు చేస్తున్నారు. 2024 పార్లమెంటు ఎన్నికలు ముగిసిన ఆరు నెలల్లోనే ఐదు రాష్ట్రా?టల్లో ఎన్నికలు జరిగాయి. మరో రెండు నెలల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఆ తర్వాత బిహార్, ఆ తర్వాత మరో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ పరిస్థితి మార్చాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే వన్ నేషన్, వన్ ఎలక్షన్ నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు ప్రత్యేక కమిటీ వేసి నివేదిక కోరింది. కమిషన్ అన్ని పార్టీలతో చర్చించి నివేదిక అందించింది. తాజాగా వన్ నేషన్, వన్ ఎలక్షన్‌కు కేబినెట్ ఆమోదం లభించింది. ఇక పార్లమెంట్‌లో బిల్లు పాస్ చేయడమే తరువాయి. దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి రాజ్యాంగం సవరించాల్సి ఉంటుంది. సుమారు 18 సవరణలు అవసరమని కమిషన్ సూచించింది. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు జమిలీ ఎన్నికలే జరిగేవి. కానీ ప్రభుత్వాలు కూలిపోవడం, రాజకీయ అనిశ్చితితో ముందస్తు ఎన్నికలకు వెళ్లడం, ప్రభుత్వాలు రద్దు చేయడం వంటివి జరుగుతున్నాయి. దీంతో ఏ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరుగుతాయో తెలియడం లేదు. ఫలితంగా దీనిని సరిచేయాలంటే 18 రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. ముందు కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాల పరిమితిని తగ్గించాలి. రాజ్యసభలోని 245 సీట్లలో ఎన్డీఏకు 112, ప్రతిపక్ష పార్టీలకు 85 ఉన్నాయి. మూడింట రెండొంతుల మెజారిటీకి ప్రభుత్వానికి కనీసం 164 ఓట్లు అవసరం. లోక్‌సభలో కూడా 545 సీట్లకు గాను ఎన్‌డీఏకు 292 సీట్లు ఉన్నాయి. మూడింట రెండు వంతుల మెజారిటీ మార్క్ 364 వద్ద ఉంది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల విధానం వల్ల సమయం, డబ్బు, శ్రమ వృథా అవుతోందని ప్రభుత్వం కొంతకాలంగా ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించాలని ఎన్డీఏ సర్కార్ కంకణం కట్టుకుంది. అంటే.. జమిలి ఎన్నికల పట్ల వైసీపీ సానుకూలంగా ఉన్నట్టు స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో.. జగన్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే పనిలో పడ్డారు. అటు కేడర్ కూడా గతంలో పోలిస్తే.. కాస్త యాక్టివ్ అయ్యింది. జమిలి ఎన్నికలు జరిగితే తప్పకుండా మేలు జరుగుతుందని వైసీపీ భావిస్తోంది. ఇక టీడీపీ విషయానికొస్తే.. జమిలిపై ఇప్పటివరకు ఆ పార్టీ స్పందించలేదు. అదే సమయంలో.. జమిలి వస్తే ఎంతోకొంత నష్టం జరగొచ్చని ఆ పార్టీ నేతలు భావిస్తున్నట్టు సమాచారం. 2024 ఎన్నికల సమయంలో ఉన్న ఊపు, వైసీపీపై కోపం.. జమిలి ఎన్నికలు జరిగే నాటికి ఉంటుందా అనే చర్చ టీడీపీ వర్గాల్లో జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ బీజేపీ అనుకున్నట్టు జరిగితే.. 2027 మార్చి తర్వాత ఎన్నికలు వచ్చే అవకాశం ఉంది.

# కబ్జా కోరల్లో ప్రభుత్వ పాఠశాల

- దారి లేక మూతపడిన పాఠశాల
- అధికారుల నిర్లక్ష్యంతో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ పాఠశాల
- శిధిలావస్థలో పాఠశాల భవనం..!
- కనుమరుగు కానున్న దశాబ్దాలకాల పాఠశాల
- పాఠశాల భవనం కోసం 40 సం. క్రితం స్థలం ఇచ్చిన దాత
- అంగన్వాడి నిర్వహణ లేక ప్రైవేట్ స్కూల్ ఆశ్రయిస్తున్న చిన్నారులు
- అంగన్వాడి స్కూల్ కి అందుబాటులోకి తేవాలని స్థానికులు వేడుకోలు
- అధికారులు స్పందిస్తే 7గుంటల భూమి అంగన్వాడీ కి వినియోగం
- పత్రికలో ప్రచురించినా.. అధికారుల మౌనం ఎవరికీ అనుకూలం
- దశాబ్దాలకాలం కళ్ళముందే పాఠశాల కనుమరుగయ్యే ప్రమాదం
- ఎందరినో విదవంతుల్ని చేసిన పాఠశాల నేడు పట్టింపు కరువు
- పాఠశాలకి వెళ్లే దారిని కబ్జా చేస్తే చర్యలు తీసుకోరా.?
- పూర్వ వైభవం తేవాలని నర్సయ్యగూడెం వాసుల వేడుకొలు









సూర్యాపేట, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఐదవ వార్డు నరసయ్య గూడెం లో సుమారు 40 సంవత్సరాలకు పైగా నడిచి ఎందరినో ఉన్నత విదవంతుల్ని చేసిన పాఠశాల నేడు పట్టింపు కరువైంది ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారిని కబ్జా చేస్తే, అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పాఠశాల మూతపడింది. ఈ పాఠశాల మూతపడి సంవత్సరాలు గడుస్తున్న సంబంధిత విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. తలుపులు, కిటికీలు ధ్వంసం చేశారు. గతంలో పిల్లలతో కళకళలాడిన ప్రభుత్వ పాఠశాల పేద పిల్లలకు దూరమైంది. ఈ పాఠశాలలోనే అంగన్వాడి కేంద్రం నిర్వహించారు. పాఠశాలకు దారి లేకపోవడంతో అంగన్వాడి కేంద్రాన్ని గ్రామంలో ఒక ప్రైవేట్ ఇంట్లో నిర్వహిస్తున్నారు. పాఠశాల భవన నిర్మాణానికి పెద్ద మనసుతో ఓ రైతు స్థలాన్ని దానమిచ్చారు. పాఠశాల భవనం నిర్మాణం నుంచి ఉన్న దారిని కబ్జా చేయటంతో పాఠశాల మూతబడింది అని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పాఠశాలలో గతంలో పోలింగ్ కేంద్రాన్ని నిర్వహించారు. ప్రస్తుతం పోలింగ్ కేంద్రాన్ని నేరేడుచర్లలోని ప్రగతి విద్యాలయానికి మార్చారు. ప్రభుత్వము ఎంతో ఖర్చు పెట్టి నిర్మించిన పాఠశాల భవనం దారిలేని కారణంగా మూతపడటంతో భవనం శిథిలావస్థకు చేరింది. పేద పిల్లలకు అందుబాటులో ఉన్న పాఠశాల మూతపడడంతో, విద్యార్థులకు, అంగన్వాడి పిల్లలకు ఇబ్బందిగా ఉంది. పాఠశాల మూత పడటంతో పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేద పిల్లలకు నాణ్యమైన విద్య, పోషకాహారం, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వము ఈ పాఠశాలకు పూర్వ వైభవము తీసుకురావాలని గ్రామస్తులు కోరారు. చాలీచాలని ఆదాయంతో బతుకుతున్న పేదలు తమ పిల్లలను ప్రైవేటు విద్యాసంస్థలలో చదివించాలంటే భారంగా ఉందని దిక్కులేని పరిస్థితిలో చిన్నపిల్లలను నేరేడుచర్లలోని ప్రైవేటు పాఠశాలలకు పంపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బడిబాట కార్యక్రమములో ఈ బడిబాట గురించి అధికారులు పట్టించుకోలేదు. ఎంతో కాలంగా పాఠశాలకు ఉన్న దారిని కబ్జా చేస్తే విద్యాధికారులు పట్టించుకోకపోవడం విచారకరం. బాటలేని కారణంగా బడి మూతపడితే, అందులో చదివే విద్యార్థుల భవిష్యత్తు గురించి విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. పేద పిల్లలకు అందుబాటులో దాత 45 సంవత్సరాల క్రితం ఇచ్చిన స్థలంలో పాఠశాలను నిర్మించారు. పాఠశాల దారి కబ్జా అయిన విషయము అధికారులకు విన్నవించినప్పటికీ, పత్రికలలో ప్రచురించినప్పటికి ఎటువంటి చర్య తీసుకోలేదని గ్రామస్తులు తెలిపారు. పాఠశాల భవనం శిథిలావస్థలో ఉంది. దాని చుట్టూ ఉన్న స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారు. తలుపులు, కిటికీలు, ఫర్నిచర్ ధ్వంసం చేశారు. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా, పశువులకు పాకగా మారింది. సంబంధిత అధికారులు ఈ పాఠశాల వైపు కన్నెత్తి చూడటం లేదు. విద్యార్థులతో సందడిగా ఉన్న పాఠశాల దారిని కబ్జా చేసి మూతపడటానికి కారుకులెవరు? దారిని కబ్జా చేసిన వారిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఈ ప్రశ్నలకు నేటికీ అధికారుల నుండి ఎటువంటి సమాధానం లేదు. ప్రభుత్వము కోట్ల రూపాయలు ఖర్చు చేసి విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తుంటే, అధికారులు మాత్రం ఈ పాఠశాల పై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కబ్జాకు గురైన దారిని విడిపించి పాఠశాలను తిరిగి ప్రారంభించాలని, లేని యెడల కనీసం అంగన్వాడీ కేంద్రం కోసం వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

### ఎంఈఓ వివరణ

దారిలేక మూతబడిన నర్సయ్య గూడెం పాఠశాల గురించి మండల ఎంఈఓ సత్యనారాయణ రెడ్డిని వివరణ అడగగా పాఠశాలకు సంబందించిన విషయం, దారి సమస్య తనకు తెలియదని, ఇంత వరకు తమ దృష్టికి రాలేదు అన్నారు.
ఎమ్మార్వో, డీఈఓ లను సంప్రదించి సంబందించిన విషయాలు తెలుసుకొని ఉన్నతాధికారుల ఆదేశానుసరం ఎంక్వరీ చేసి స్కూల్ మూసివేతకు గల కారణాలు వెల్లాడిస్తానని, కబ్జా కు గురయితే చర్యలు తీసుకుంటామని అన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**- జిల్లాకు పేరు, ప్రతిష్టలు తీసుకురావాలి**
**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**





జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): సోమవారం జిల్లా కేంద్రంలోని డా బిఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో సీఎం కప్ క్రీడా పోటీలను ఎస్పి కిరణ్ కిరణ్ ఖరే తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సీఎం కప్ పోటీలను ప్రకటించారు. ఈ సందర్భంగా పావురాలను గాల్లోకి ఎగుర వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తెలిపారు. గ్రామస్థాయి నుండి క్రీడాకారులను ప్రోత్సాహించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గత నెల 27వ తేదీ నుండి గ్రామస్థాయిలో సిఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా స్థాయిలో ఈ నెల్ 16వ తేదీ నుండి 20వ తేదీ వరకు వివిధ క్రీడా అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు గ్రామ స్థాయి నుండి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు గ్రామస్థాయి నుండి ప్రపంచ స్థాయికి ఎదిగే విధంగా తెలంగాణ రాష్ట్ర నుండి క్రీడకారులను తయారు చేయడానికి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో సీఎం కప్ పోటీలలో గెలుపొందిన రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. క్రీడల్లో మన కీర్తి ప్రపంచానికి చాటాలని పేర్కొన్నారు. క్రీడలు ఆడటం వల్ల చురుకుదనం ఉంటుందని తద్వారా విద్యలో సైతం రాణిస్తారని తెలిపారు. గెలుపు ఒక మధురమైన అనుభూతి అని, ఓటమితో కృంగిపోకుండా సమీక్షించుకుంటూ ముందుకు పోవాలని సూచించారు. ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ గెలుపు ఓటమితో సంబంధం లేకుండా క్రీడాకారులు ఆటల్లో పాల్గొనాలని సూచించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయికి చేరుకున్నందుకు క్రీడాకారులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్ర స్థాయిలో రాణించి మన జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని అన్నారు. అంతకు ముందు క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. తదుపరి జెండా ఊపి క్రీడా పోటీలు. ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా స్పోర్ట్స్ అధికారి రఘు, డీఈఓ రాజేందర్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీస్తు బోధనలు పవిత్రమైనవి




### మాజీ మేయర్ మేకల కావ్య

జవహర్ నగర్, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): క్రీస్తు బోధనలు ఎంతో పవిత్రమైనవని, క్రిస్మస్ పండుగవేళ దానం చేస్తే జీవతం దన్యమవుతుందని మాజీ మేయర్ మేకల కావ్య అన్నారు. జవహర్ నగ రాకార్పొరేషన్లోని సీఎస్ఐ ఆల్ సెయింట్స్ చర్చ్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మేయర్ మేకల కావ్య హాజరై మాట్లాడుతూ లోకరక్షకుడు క్రీస్తు జన్మదినమే క్రిస్మస్ పండుగని, క్రీస్తు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంగీతారాజశేఖర్, పాస్టర్ సుశీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్షలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): ఆది, సోమవారాల్లో రెండు రోజులపాటు నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడా ఎలాంటి అవాంతరనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పరీక్షల నిర్వహణ సందర్భంగా 38 పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు 144 సెక్షన్ అమలు చేశారు. జిల్లాలో 13,466 మంది పరీక్షకు హాజరు కావలసి ఉండగా, మొదటి రోజు ఆదివారం రెండు సెషన్లలో పరీక్షకు 12,572 మంది హాజరయ్యారు. ఇక రెండవ రోజు సోమవారం రెండు సెషన్లలో 12343 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో గల సెంట్ మేరీస్ హై స్కూల్లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి అక్కడ ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# కార్పొరేట్ విద్యావిధానాన్ని నియంత్రించాలి

**- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా విధానాన్ని ప్రోత్సహించాలి**
**- టీఎస్‌యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా మహాసభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి**




షాద్ నగర్: కార్పొరేట్ విద్యా విధానాన్ని నియంత్రించాలని, అలా జరిగినప్పుడే పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్య అందే అవకాశం ఉంటుందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఠాగూర్ హైస్కూల్ ఆడిటోరియంలో జరిగిన సంఘం జిల్లా మహాసభల్లో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు పూర్తయినా ఇంకా ఎంతో మంది నిరుపేదలు చదువుకు దూరంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకో వాలని సూచించారు. ఎంతోమంది తల్లిదండ్రులు కూటికి లేకున్నా తమ పిల్లలకు కార్పొరేట్ స్కూళ్లలో చదివించాలని తాపత్రయపడుతున్నా రని తెలిపారు. అలాంటి విద్యా విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించడం విడ్డూరంగా ఉందన్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, పేస్కేల్ విడుదల చేయాలన్నారు. 317 జీవోతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా గోపాల్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఎం వెంకటప్ప ఎన్నికయ్యారు.

# గ్రూప్ 2 పరీక్షా కేంద్రాలలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మాంటిసోరి, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న గ్రూప్ 2 పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 17 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టిజిపిఎస్సి నిబంధనలు మేరకు పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్ అనుమతి లేనికారణంగా నిబంధనలు పాటిస్తూ, కలెక్టర్ పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు తీసుకురావద్దన్న నియమాన్ని ఆయన పాటించారు. తన సెల్ ఫోన్‌ను వాహనంలోనే వదిలి వెళ్లి పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పర్యవేక్షణ, సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని ఇన్విజిలేటర్స్, చీఫ్ సూపరింటెండెట్లుకు సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో పరీక్ష సజావుగా, సక్రమంగా జరిగేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేశామని తెలిపారు. పరీక్ష పూర్తి అయ్యే వరకు అభ్యర్థులను బయటికి పంపొద్దని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరాటంకంగా సరఫరా చేస్తున్నామని తెలిపారు. అత్యవసర వైద్య సేవలకు అన్ని కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవల కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సురక్షిత మంచినీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 4 సబ్జెక్ట్ లో గ్రూప్ 2 పరీక్ష ఉంటుందని మొదటి రోజు ఉదయం, సాయంత్రం అలాగే రెండో రోజు ఉదయం సాయంత్రం పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మాంటి సొరిలో పాటశాలలో 15 రూములు ఏర్పాటు చేశామని 360 మంది అభ్యర్థులు హాజరు కావల్సి ఉండగా 190 మంది హాజరు అయ్యారని, 170 మంది గైర్హాజరు అయ్యారని, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ లో 12 రూములు ఏర్పాటు చేయగా 288 మంది అభ్యర్థులు హాజరు కావల్సి ఉండగా 144 మంది హాజరయ్యారని, 144 మంది గైర్హాజరయ్యారని, అలాగే భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 12 రూములు ఏర్పాటు చేయగా 288 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 116 హాజరయ్యారని,172 మంది గైర్హాజరు అయినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజిపిఎస్సి పర్యవేక్షకులు, చీఫ్ సూపర్రింటెండట్లు, రూట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి చేయాలి

**- కొనుగోళ్లు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలి**

**- అంగన్వాడి కేంద్రాలలో మెనో ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలి**

**- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): సోమవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ కురవి, మహబూబాబాద్, మరిపెడ మండలాల్లో సుడిగాలి పర్యటన చేశారు. కురవి,మహబూబాబాద్ పట్టణం 11వ వార్డు, భవాని నగర్ కాలనీ, 16వ వార్డు, రామన్నపేట కాలనీ, మరిపెడ మండలం, అబ్బాయిపాలెం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి పక్క ఇండ్లు నిర్మించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే సర్వే నిర్వహించడం జరుగుతుందని, ప్రతిరోజు సర్వే నివేదికలు ప్రభుత్వానికి ఆన్లైన్ విధానం ద్వారా సమర్పించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం ఖచ్చితమైన సమాచారం క్షేత్రస్థాయిలో సేకరించాలని, సిబ్బందిని ఆదేశించారు.



సర్వే వివరాలను నిత్యం ఉదయం, సాయంత్రం పర్యవేక్షిస్తూ తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో ఇందిర ఇండ్ల సర్వే జరుగుతుందని అన్నారు. కురవి మండల కేంద్రం, మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని సంబంధిత నిర్వాహకులను ఆదేశించారు, ధాన్యానికి సంబంధించి రైతుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి వెంటనే డబ్బులు పడేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చింది, ఎంత ధాన్యం కొనుగోలు చేశారు, ఇంకా ఎంత ధాన్యం రావాల్సి ఉంది అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరిపెడ మండలం, అబ్బాయి పాలెం గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. పాఠశాలలో రుచికరమైన భోజనం అందిం చాలని, మంచి వాతావరణంలో విద్యబోదనలు అందించా లన్నారు. అంగన్వాడి కేంద్రాలలో మెనో ప్రకారం పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలని, శ్యామ్, మ్యామ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి నిత్యం పర్యవేక్షించాలని, గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు హెల్త్, పౌష్టిక ఆహారం అందించెందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని సూచించారు, మహబూబాబాద్ పట్టణంలో ఉన్న వెజ్, నాన్ వెజ్, ఫ్రూట్, ఫ్లవర్ మార్కెట్ ను సందర్శించారు, ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు మున్సిపల్ కమిషనర్ రవీందర్, డిప్యూటీ ఇంజనీర్ ఉపేందర్, కురవీ ఎంపీడీవో, తదితరులు ఉన్నారు.

# పారదర్శకంగా సర్వే జరగాలి

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగామ జిల్లా, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 22 వ వార్డు లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ ను సోమవారం కలెక్టర్ పరిశీలించారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల క్షేత్రస్థాయి స్థితిగతులపై ఇందిరమ్మ ఇళ్ల యాప్ వినియోగిస్తూ చేస్తున్న సర్వే ప్రక్రియ ను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి మాట్లాడుతూ ఇండ్లులేని నిరుపేదలకు నివాసం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తోందని, దరఖాస్తుదారులు సంబంధిత పత్రాలను ముందస్తుగా అందుబాటులో పెట్టుకొని సర్వే వేగవంతం అయ్యేందుకు సహకరించాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి, తప్పిదాలకు తావులేకుండా వివరాలను సేకరించి ఇందిరమ్మ యాప్‌లో లాగిన్ అయ్యి వివరాలను పక్కగా నమోదు చేయాలన్నారు. సర్వే కోసం భూమి యాజమాన్య పత్రం అత్యంత ముఖ్యమైనదని, సొంత ఇంటికి స్థలం ఉందా, ఉంటే దానికి సంబంధించిన దృవపత్రాలు, అవి లేని పక్షంలో ఇంటి పన్ను రసీదులు, తెల్ల రేషన్ కార్డ్ తదితర పత్రాలను పరిశీలించాలన్నారు. లబ్దిదారుడితో పాటు ఇంటి పైకప్పు, స్థలానికి సంబందించిన చిత్రాలను యాప్ లో సక్రమంగా అప్లోడ్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సర్వే జరిగే సమయంలో ప్రజలు అందు బాటులో ఉండే విధంగా షెడ్యూల్ గురించి ముందుగానే సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన జిల్లా స్థాయి సీఎం కప్ 2024 పోటీలు

**- పోటీలో పాల్గొనడమే మొదటి విజయం**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**





జనగామ జిల్లా, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): విద్యకి ప్రాధాన్యత ఇస్తూనే విద్యార్థుల మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సీఎం కప్ 2024 పోటీలను నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సీఎం కప్ 2024 జిల్లా స్థాయి పోటిల్లో భాగంగా సోమవారం స్థానిక ధర్మకంచ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిధిగా హాజరయ్యి పోటీలను ప్రారంభించారు. అనంతరం వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో ప్రతిభ కనబరచి జిల్లా స్థాయికి వచ్చిన క్రీడాకారులు అదే ఉత్సాహంతో ఇక్కడ నుండి రాష్ట్ర స్థాయికి వెళ్లి సీఎం కప్ జనగాం జిల్లాకి వచ్చేలా మిగతా క్రీడాకారులతో పోటీ పడాలన్నారు. జిల్లాలో క్రీడకారులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి కావలిసిన మౌలిక వసతులను కల్పిస్తూ స్టేడియంను వివిధ క్రీడలకు అనుగుణంగా తీర్చిద్దిద్దామ్మన్నారు. అలాగే ప్రతి కార్యక్రమంలో క్రీడలకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి క్రీడాకారులను ప్రోత్సాహిస్తున్నమన్నారు. గెలుపు, ఓటమి లను ఆలోచంచకుండా ప్రతీ పోటీలో పాల్గొనాలని అదే మొదటి విజయమన్నారు. అనంతరం వాలిబాల్, బ్యాడ్ మెంటన్, బేస్ బాల్ క్రీడలని డీసీపీ తో కలిసి కలెక్టర్ ఆడి ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# క్రీడలు జీవితంలో భాగం కావాలి

**- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**







భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): ప్రతి ఒక్కరూ క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సోమవారం కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల ద్వారా మెడల్స్ సాధించడం కంటే ఆటలను ఆడుతూ ఆస్వాదించడంలో ఎంతో ఆనందం దాగి ఉంటుందని అన్నారు. సీఎం కప్ ద్వారా గ్రామీణ స్థాయిలో క్రీడాకారులు రాణించి, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ ద్వారా బహుమతులు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లాలో క్రీడల అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించామని ఇందుకోసం అవసరమైన నిధులను సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన అన్నారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు యువతను ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్న అని చెప్పారు. అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలు ఆడటం ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయడంతో పాటు ఆటలాడడం ద్వారా మనస్సుకు ఆరోగ్యకరమైన ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. సీఎం కప్ లో పాల్గొనే క్రీడాకారులకు మంచి సలహాలు సూచనలు ఇస్తూ ప్రోత్సహించాలని సంబంధిత కోచ్ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యుగంధర్ రెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ నరేష్,జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు,జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి పరందామరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు కమలారాణి, రమేష్, శ్రీధర్, ఉదయ్, కాశీ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 27 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఎం అండ్ హెచ్ ఓ ఎన్. గోపాల్ రావు, సి పి ఓ ప్రకాష్, డిసిఓ సర్దార్ సింగ్, ఎస్సి కార్పొరేషన్ ఈ డి తుల రవి, డి ఈ ఓ పాణినీ, డి సి ఎస్ ఓ షా ఫైజల్ హుస్సేనీ, డిఎండిసిఎస్ ఓ రాం పతి, ఎస్సి వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మణ్ నాయక్, బి సి వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి, డిడబ్లుఓ ఇంచార్జ్ శిరీష, ఎల్ డి ఎం జయ ప్రకాష్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

**- ప్రజలు ఆందోళన చెందకుండా సర్వేకు సహకరించాలి**

**- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా, పగడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ వినియోగం, సర్వే నిర్వహణపై అదనపు కలెక్టర్లు, ఆర్ డి ఓ, ఎం పి డి ఓ, ఎంపి ఓ లతో టేలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇండ్లులేని నిరుపేదలకు నివాసం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తోందని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల క్షేత్రస్థాయి స్థితిగతులపై ఇందిరమ్మ ఇళ్ల యాప్ వినియోగిస్తూ సర్వే ప్రక్రియ ఈ నెల 31 నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం 90863 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటి వరకు 10594 దరఖాస్తుల సర్వే పూర్తి చేశామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా సర్వే కొనసాగుతోందని ప్రతిరోజు సర్వే నివేదికలు ప్రభుత్వానికి ఆన్ లైన్ విధానం ద్వారా పంపించడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కా ఇండ్లు నిర్మించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇల్లు సర్వే చెయడం జరుగుతుం దనీ, ప్రజలు ఆందోళన చెందవద్దనీ, ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు సహకరించాలనీ, ఎలాంటి సందేహాలు ఉన్న సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులను, ఎం పి డి ఓ లను సంప్రదించి సందేహా లను నివృత్తి చేసుకోవాలని లేదా కలెక్టరేట్లోనీ కంట్రోల్ రూమ్ నెంబర్ 1800 425 7109 ను సంప్రదించాలని కలెక్టర్ జిల్లా ప్రజలను కోరారు.

# జీడిమెట్లల ఈఎస్ఐ ఆసుపత్రిలో సమయపాలన పాటించని సిబ్బంది

కుత్బుల్లాపూర్: తిరిగి తిరిగి కాల్లు అరిగిపోతున్నాయి కానీ ఉన్న రోగానికి మాత్రం చికిత్స చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు జీడిమెట్ల ఈ ఎస్ ఐ ఆసుపత్రికి వచ్చే రోగులు. షాపూర్ నగర్ జీడిమెట్ల ఈఎస్ఐ డిస్పెన్సరీ లో కనీసం సమయపాలన పాటించకుండా, దుర్భాశ లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ల ను కలిసేందుకు వెళ్తే సిబ్బంది దురుసు గా ప్రవర్తించడమే కాకుండా ఉదయం నుండి సాయంత్రం వరకు బైట నిలబెడితున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వారికి ఇష్టమొచ్చిన సమయంలో విధులకు వస్తారని,మధ్యాహ్న భోజన సమయం 2గంటల పైగా తీసుకుంటారని,గంట ముందే డిస్పెన్సరీ మూసివేసి వెళ్తారని చెబుతున్నారు రోగులు. శని వారం మధ్యహం వరకు ఆసుపత్రి సమయం ఉన్నా,మందులు లేవంటూ ఇవ్వకుండా ఆసుపత్రి మూసేశారని తెలిపారు. ఒక్కసారి ఆసుపత్రిలో వైద్యం కోసం వస్తే.. నెల రోజుల వరకు తిరిగినా మందులు లేవని సిబ్బంది తిప్పి పంపిస్తున్నారనీ ఆందోళన చేశారు. ఈఎస్ఐలో కార్మికులకు సకాలంలో వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనీ,అధికారులు స్పందించి ఇలాంటి నిర్లక్ష్యపు వైద్యులను,సిబ్బందిని తప్పించాలని కోరుతున్నారు

# సికేఎం ప్రసూతి ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

వరంగల్ జిల్లా, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): వరంగల్ లోని సికేఎం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వచ్చే గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఇన్ పేషంట్, ఔట్ పేషంట్, నవజాత శిశువులకు అందిస్తున్న వైద్య సేవల గదులతోపాటు ల్యాబ్, పరిపాలన విభాగం, ఆంటీనేటల్ వార్డ్, లేబర్ గది, పోస్ట్ నెటల్ వార్డ్, ఆపరేషన్ థియేటర్,ఫార్మసీ స్టోర్, కిచెన్‌లను కలెక్టర్ పరిశీలించారు. వైద్య సేవలకు సంబంధించిన పలు రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని కలెక్టర్ ఆరా తీశారు. సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. సమీకృత సలహా పరీక్ష(ఐసీటీసీ) కేంద్రాన్ని, అదేవిధంగా ఆసుపత్రి లోనిహెచ్ఐవి టెస్ట్ సెంటర్ను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలోని ఐపి, ఓపీ సంఖ్యను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వచ్చే గర్భిణీలు బాలింతలు నవజాత శిశువులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలను అందిం చాలన్నారు. ఆసుపత్రిలో ఏవైన ఇబ్బందులు ఉంటే పరిష్కరిం చేందుకు చర్యలు చేపడతానని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో వర్తించే వివిధ జబ్బులకు సంబంధించిన వివరాలతో కూడిన జాబితాను ప్రదర్శించేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందికి పలు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భం గా గర్భిణీలు, బాలింతలతో అందుతున్న వైద్యం గురించి కలెక్టర్ అడిగి తెలుసుకు న్నారు. ఆసుపత్రికి ప్రతిరోజు 300 మంది పేషంట్లు వస్తున్న దృష్ట్యా ప్రస్తుతమున్న రెండు ఓపి కౌంటర్లకు అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. శానిటేషన్






వ్యవస్థ మెరుగు పరుచుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వంటగదిను కలెక్టర్ స్వయంగా సందర్శించి సరుకుల నాణ్యతను, వండిన వంట పదార్థా లను పరిశీలించారు. ఆసుపత్రి డాక్టర్లతో పాటు సిబ్బంది అందరికీ బయోమెట్రిక్ అటెండెన్స్ తో పాటు ఐ డి కార్డులు అందజేయా లన్నారు. ఆస్పత్రి ఇరువైపులా వెంటనే సీసీ కెమెరాలు అమర్చుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేషెంట్లకు ప్రతి ఔషధం ఆస్పత్రి నుండే అందజేయాలని బయట నుండి పేషెంట్ల ద్వారా తెప్పించినట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫార్మసీలో అధికంగా తక్కువగా వినియోగించే ఔషధాల వివరాలు ఫార్మసిస్టును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలో మల్టీ ప్యారా మానిటర్ను ప్రారంభించారు. ఆసుపత్రిని, పరిసరాలను పరిశీలించి పనికిరాని వస్తువులను పరిసరాలలో పేరుకొని ఉన్న పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. పరిసరా లలో ఎలుకల నివారణ నిమిత్తం కాంక్రీట్ వేయాలని సూచిం చారు. పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించడంలో భాగంగా వారి సౌకర్యార్థం కావలసిన పరికరాలు, సిబ్బంది తదితర వివరాలను ఉన్నతాధికారు లకు పంపుటకు గాను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షర్మిల, ఆర్ ఎం ఓ లు డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ సత్య జిత్ రే, ఏవో సాజిద్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-2 పరీక్ష కేంద్రంను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





ములుగు జిల్లా, డిసెంబర్ 16 (తీన్మార్ న్యూస్): సోమవారం ములుగు మండలం జీవంతరావు పల్లి లోని తెలంగాణ మాడల్ స్కూల్ కాలేజ్ లో గల పరీక్ష కేంద్రంలోని గ్రూప్-2 పరీక్ష కేంద్రమును జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆకస్మికంగా సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. టిజిపిఎస్సి నిబంధనలు మేరకు పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్ అనుమతి లేనికారణంగా నిబంధనలు పాటిస్తూ, కలెక్టర్ పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు తీసుకురావద్దన్న నియమాన్ని ఆయన పాటించారు. తన సెల్ ఫోన్‌ను వాహనంలోనే వదిలి వెళ్లి పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పర్యవేక్షణ, సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్షల నిర్వహణలో నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని ఇన్విజిలేటర్స్, చీఫ్ సూపరింటెండెట్లుకు, అధికారులకు తగు సూచనలు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. పరీక్ష సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్ష పూర్తి అయ్యే వరకు అభ్యర్థులను బయటికి పంపొద్దని ఆదేశించారు. పరీక్ష ముగిసిన తర్వాత జవాబు (ఓఎంఆర్ )పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని పరీక్ష ముగిసేంతవరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 09 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో పరీక్ష సజావుగా, సక్రమంగా జరిగేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు ఉన్నారు.

# రియల్ భూమ్ తగ్గిందా...?

హైదరాబాద్: హైదరాబాద్ లో ఇటీవల కాలంలో ఫ్లాట్ల ధరలు భారీగా తగ్గినట్లు పెద్దయెత్తు ప్రచారం జరుగుతుంది. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారుల కథనం ప్రకారం ఇటీవల కాలంలో ఫ్లాట్ల ధరలు పెరగలేదు కానీ.. అదే సమయంలో తగ్గలేదని చెబుతున్నారు. అంటే ధరలు నిలకడగానే ఉన్నాయని ధరలను తగ్గించి అమ్మకాలు చేస్తే తమకు నష్టం వస్తుందని చెబుతున్నారు. నిజానికి రిజిస్ట్రేషన్లు తగ్గడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా పడిపోయిందని అందరూ భావించారు. కానీ దేశమంతా రియల్ వ్యాపారం ఇబ్బందుల్లో ఉందని చెబుతున్నారు. అందువల్లనే కొంత కాలం ఈ ధరలు పెరగకుండా నిలకడగానే ఉంటాయని, కానీ కొత్త ఏడాదిలో ధరలు మళ్లీ పెరుగుతాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. హైదరాబాద్ లో ఫ్లాట్ల కొనుగోళ్లు తగ్గడానికి ప్రధాన కారణం ఎక్కువ వెంచర్లు ఉండటమూ ఒక కారణమని చెబుతున్నారు. దీంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థలు కొన్ని ముందుగానే ప్రీ లాంచ్ పేరుతో వసూలు చేసి పలాయనం చిత్తగించడంతో ఫ్లాట్ల పై పెట్టుబడి పెట్టేందుకు ప్రజలు ఒకింత వెనకడుగు వేస్తున్నారన్న అభిప్రాయం కూడా ఉంది. ఇటీవల కాలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు దాదాపు మూడు వేల కోట్ల రూపాయలు ప్రజలకు టోకరా పెట్టడంతో పోలీస్ కేసులు నమోదయ్యాయి. రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థలు చిట్ సంస్థలుగా మారిపోయాయన్న కథనాలు వినిపిస్తున్నాయి పోలీసులు కూడా వాటిపై ఛీటింగ్ కేసు నమోదు చేస్తుండటంతో ప్రీలాంచ్ పేరుతో మోస పోయేకన్నా రెడీ టూ ఆక్యుపైగా ఉన్న ఫ్లాట్లను మాత్రమే కొనుగోలు చేస్తారని, వాటిని వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారని అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఒక్కసారి పెట్టుబడులు పెట్టలేక ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో వసూలు చేస్తున్నారు. అపార్ట్ మెంట్ల నిర్మాణానికి కోట్ల రూపాయల నిధులు అవసరం కావడంతో పాటు, వడ్డీకితెచ్చి నష్టపోయే కన్నా, కొనుగోలుదారుల నుంచి అడ్వాన్స్ రూపం లోఎక్కువ మంది వద్ద సేకరించడం ఎప్పటి నుంచో జరుగుతుంది. ముందుగా అడ్వాన్స్ బుక్ చేసుకుని కొంతమొత్తం చెల్లిస్తే ప్రత్యేక ఆఫర్లు కూడా ప్రకటించి ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఈ ప్రయత్నాలను కొంత మంది బిల్డర్లు తమ వ్యవహారశైలి ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. మోసాలు పెరగడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ముందుగా చెల్లించడానికి ఎవరూ ముందుకు రాకపోవడం తో అనేక వెంచర్లు మధ్యలోనే నిలిచిపోయాయి. మొత్తం మీద హైదరా బాద్ నగరంలో రియల్ వ్యాపారం మాత్రం పడిపోలేదని, అలాగని పెరగలేదని, నిలకడగా ఉందని రియల్ వ్యాపారులు చెబుతున్నారు.

# భువనగిరి కళాశాల మైదానాన్ని అభివృద్ధి చేయాలి: బీఆర్ఎస్

భువనగిరి: భువనగిరి కళాశాల మైదానాని అభివృద్ధి చేయడంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి పూర్తిస్థాయిలో మట్టిని చదును చేశారని మరింత అభివృద్ధి చేయాలని రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు కొలుపుల అమరేందర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ బిఆర్ఎస్ పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె శేఖర్ రెడ్డి చొరవ చూపి స్థానిక ఏజిఐ ఫ్యాక్టరీ ద్వారా సిఎస్సార్ ఫండ్స్ ద్వారా గుట్టను తులసి మైదానంలో మట్టి నింపి చదును చేశారన్నారు మినీ ఫుట్బాల్ గ్రౌండ్ను నిర్మించడం జరిగిందన్నారు. క్రీడల కోసం వాకింగ్, రన్నింగ్ ట్రాక్ ల కోసం గతంలో ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు.



క్రీడలకు ఉపయోగించుకునే విధంగా పూర్తిస్థాయిలో మైదానాన్ని తయారు చేయాలని డిమాండ్ చేశారు లేకుంటే బీర్ ఎస్ ఆధ్వర్యంలో ప్రజలను విద్యార్థులను యువకులను సమీకరించి ఉద్యమాలు చేస్తామని తెలిపారు.

# విద్యార్థినీలకు పాఠ్య బోధనంలో ఇబ్బందులు కలగొద్దు

క్రిష్ణా : నారాయణపేట జిల్లా క్రిష్ణా మండల పరిధిలోని హిందూపూర్ గ్రామ శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యానిలయాన్ని జిసిడివో పద్మనాలిని, ఎంఈఓ నిజముద్దీన్ సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సమగ్ర శిక్ష ఉద్యోగులు ధర్నాలో ఉన్నందున పాఠశాలలో నెలకొన్న సమస్యలు, భోజన వసతి పై విద్యార్థినీయులను అడిగి తెలుసుకున్నారు. విద్యానిలయంలో విద్యార్థినీయులకు ఏర్పాటు చేస్తున్న వంటలను, కూరగాయలను పరిశీలించి, పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థినీయులకు బోధన విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండగా నాన్ టీచింగ్ ఉపాధ్యాయులను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు డిజిటల్ పాటలను బోధిస్తున్నట్లు తెలిపారు, సమగ్ర శిక్ష ఉద్యోగులు తిరగ పనిలో చేరేవరకు విద్యార్థినీయులకు బోధన విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాటుతో కూడిన చర్యలను చేపట్టామని ఆమె తెలిపారు,



విద్యార్థినీయులకు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు.

# భయాందోళన కల్గిస్తున్న చిరుత పులి

అదిలాబాద్: తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో వన్య మృగాలు సంచారం కలకలం రేపుతోంది. ఏపీలోని శ్రీశైలం, మహానంది...తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ లో చిరుత, పెద్ద పులి సంచారం ప్రజలను భయాందోళనకు గురిచేస్తుంది. ఆదిలాబాద్ జిల్లాలో చిరుత దాడిలో ఓ మహిళ గాయపడిందిశ్రీశైలం మరోసారి చిరుత కలకలం రేపింది. శ్రీశైలం జలాశయం సమీపంలో రోడ్డు పక్కన గోడపై చిరుత కనిపించిందని వాహనదారులు తెలిపారు. చిరుతను చూసి వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. రోడ్డుపై కూర్చొన్న చిరుత పులిని వీడియోలు తీశారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. శ్రీశైలంలో చిరుత సంచారంతో ఆలయానికి వచ్చే భక్తులు భయాందోళన చెందుతున్నారుశ్రీశైలంలో ఇటీవల సైతం చిరుత సంచరించినట్లు వార్తలు వచ్చాయి. ఆర్టీసీ బస్టాండ్, ఏఈవో ఇంటికి సమీపంలో చిరుత కనిపించిందనే వార్తలు వైరల్ అయ్యాయి. భక్తులు, స్థానికులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ, శ్రీశైల దేవస్థానం అధికారులు సూచించారు. రాత్రి సమయాల్లో ఒంటరిగా బయటకు వెళ్లొద్దని హెచ్చరించారు. నంద్యాల జిల్లా మహానంది క్షేత్రంలోనూ చిరుత సంచారం కలకలం రేపింది. గాజులపల్లి సమీపంలో స్థానికులు చిరుతను చూశారు. చిరుత సంచారంపై అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. బోను ఏర్పాటు చేసే వరకు స్థానికులు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. రాత్రుళ్లు ఒంటరిగా తిరగవద్దని హెచ్చరించారు తెలంగాణ లోని ములుగు జిల్లాలో పెద్దపులి సంచారం స్థానికులను భయాందోళనకు గురిచేస్తుంది. తాడ్వాయి పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న పెద్దపులి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి ప్రవేశించిందని అటవీ అధికారులు తెలిపారు. పినపాక, ఇల్లందు, కొత్తగూడెం అటవీ ప్రాంతాల్లో పులి తిరుగుతున్నట్లుగా అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. పెద్దపులి ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో తిరుగుతున్న పరిస్థితి ఉందన్నారు. గతంలో కరకగూడెం ఆళ్లపల్లి రేగళ్ల అటవీ ప్రాంతాల్లో పులి సంచారాన్ని అటవీ అధికారులు గుర్తించారు. తిరిపి మళ్లీ ఇప్పుడు పులి ఆనవాళ్లను అధికారులు గుర్తించారు. గుండాల, అల్లపల్లి మండలాల్లో గత మూడు రోజులుగా పెద్ద పులి కలకలం రేపుతోంది. గుండాలకు సరిహద్దు అడవుల్లో పులి సంచరించినట్టు ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. అక్కడి నుంచి గుండాల ఆళ్లపల్లి ప్రాంతాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. అటవీ ప్రాంతం సమీపంలోన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం దేడ్రా గ్రామంలో ఓ మహిళపై చిరుత దాడి కలకలం రేపుతోంది. అర్క భీమ్ బాయి ఉదయం 5 గంటలకు గ్రామ సమీపంలో బహిర్భూమికి వెళ్తున్న క్రమంలో చిరుత పులి దాడి చేయడంతో బిగ్గరగా కేకలు వేసింది. కేకలు విన్న గ్రామస్తులు అక్కడికి చేరుకునేలోపే చిరుత సమీపంలోని అడవిలోకి పారిపోయింది. చిరుత దాడిలో మహిళ ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను బజార్ హత్నూర్ లోని పీహెచ్‌సీకి తరలించి వైద్యం అందిస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం ఆమెను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అటవీ శాఖ నుంచి తక్షణ సాయం కింద రూ.10 వేలు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించండి: జిల్లా కలెక్టర్

కామారెడ్డి: ప్రజావాణి లో వచ్చిన అర్జీలను పరిశీలించి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. భూ సంబంధిత సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, అంగన్ వాడీ భవనాలు, తదితర సమస్యలపై ప్రజావాణిలో అర్జీలను దరఖాస్తు దారులు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి లో వచ్చిన అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటి వరకు ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తుల పై సమీక్షిస్తూ, ఆయా అధికారులు చర్యలు తీసుకోవాలని, పెండింగులో ఉన్న దరఖాస్తులను పరిశీలించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేయాలనీ, మండల అధికారులు సూపర్ చెక్ చేయాలని అన్నారు. అవసరమైన లాగిన్ లు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.

ఇంటింటి సమగ్ర సర్వే ఆన్లైన్ లో పొందుపరచాలని తెలిపారు. ఈ



ప్రజావాణి లో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రంగనాథ్ రావు, జడ్పీ సీఈవో చందర్, పలు శాఖల అధికారులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడ్డ జుక్కల్ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి

**- ముఖ్యమంత్రికి మండల పార్టీ అధ్యక్షులు మండల యూత్ అధ్యక్షులు విన్నపం..**

మద్నూర్: గడిచిన 50 సంవత్సరాల కాలంగా జుక్కల్ నియోజకవర్గానికి మంత్రి పదవి దక్కలేదని ప్రస్తుతం జుక్కల్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న తోటా లక్ష్మి కాంతారావు ఉన్నత చదువులు చదివిన వ్యక్తిని వెనుకబడ్డ జుక్కల్ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని అభివృద్ధి ప్రదాతకు మంత్రి పదవి ఇవ్వాలని మద్నూర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధరాస్ సాయిలు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అనుమంతు యాదవ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కి విన్నవించారు. వారిద్దరు కలిసి సోమవారం నాడు మద్నూర్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వెనుకబడ్డ జుక్కల్ అభివృద్ధికి కృషి మరింతగా జరగాలంటే ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావుకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాలం నుండి ఇప్పటివరకు ఈ నియోజకవర్గానికి మంత్రి పదవి దక్కలేదని అభివృద్ధి జరగలేదని ఎస్సీ రిజర్వుడు కాన్స్టెన్సీ అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావుకు మంత్రి పదవి ఇవ్వాలని ఈ సందర్భంగా కాంగ్రెస్



పార్టీ యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ కు విన్నవించారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు వట్నాల రమేష్ యువ నాయకులు అమూల్ కర్ల సాయిలు తూమ్ రాములు, పాల్గొన్నారు.

# గ్రూప్-2 రాస్తుండగా అభ్యర్థికి గుండెపోటు

హైదరాబాద్ : మరోగంటలో గ్రూప్-2 పరీక్ష ముగిస్తుందనగా పరీక్ష రాస్తున్న ఓ అభ్యర్థికి గుండెపోటు వచ్చింది. తక్షణమే స్పందించిన ఎస్సై అతడిని వెంటనే ఆస్పత్రిలో చేర్చి ప్రాణాపాయం తప్పించారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంగారెడ్డి జిల్లా పుల్కల్ గ్రామం లక్ష్మీనగర్‌కు చెందిన ఎల్. నగేశ్ గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యారు. నాలుగో పేపర్ రాస్తుండగా.. అతడికి గుండెపోటు వచ్చింది. దీంతో



నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. 108 వాహనం వచ్చే సమయం లేకపోవడంతో పరీక్ష కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న ఎస్సై ఆసిఫ్ వెంటనే స్పందించారు. మూడో అంతస్తులో ఉన్న నగేశ్‌ను భుజంపై మోసుకుంటూ కిందకి తీసుకొచ్చి.. వాహనంలో ఎక్కించుకొని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. దీంతో బాధితుడికి ప్రాణాపాయం తప్పింది. అయితే, అతడికి మూర్ఛ వ్యాధి ఉందని, గుండెపోటు కాకపోవచ్చని వైద్యులు తెలిపారు.

# అబద్ధాలు, అసత్యాలు మానుకోవాలి

**– లేకపోతే ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం**
**– అడ్డూ అదుపులేని అవినీతి పాలన మీది**
**– ఏడాదిలోనే అద్భుత పాలన కాంగ్రెస్‌ది : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లేఖ**




హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ నేతలు, కేసీఆర్ కుటుంబసభ్యులు కాంగ్రెస్ పాలనపై అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేయడం మానుకోవాలని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కోరారు. లేకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మాజీ సీఎం, ప్రతిపక్ష నాయకులు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్‌కు లేఖ రాశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలన అడ్డూ అదుపు లేని అవినీతితో కూడుకున్నదనీ, ఏడాది కాంగ్రెస్ పాలన అద్భుతంగా ప్రజలకు సేవలందించిందని వివరించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ వెనుకబడిందని ఆరోపించారు. దళిత ముఖ్యమంత్రి హామీని అమలు చేయకుండా సీఎంగా అందలమెక్కి మొదటి రోజు నుంచే వంచనకు పాల్పడ్డారని వివరించారు. కోర్టుల్లో కేసులు వేయించి బీఆర్ఎస్ ఉద్యోగాల భర్తీ చేపట్టలేదని తెలిపారు. అన్ని రకాల పోటీ పరీక్షలు అవకతవకలు, గందరగోళమే చేశారని తెలిపారు. కాంగ్రెస్ తొలి ఏడాదిలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి 54 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టునునాణ్యతా లోపంతో నిర్మించి, దాని మనుగడకే ప్రమాదం తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని కింద మూడు బ్యారేజీలు పని చేయకపోయినా ఈ ఖరీఫ్ సీజన్లో 66.76 లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేసేలా సాగునీరు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నాటికి రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉంటే ఆ అప్పును రూ.7 లక్షల కోట్లకు పెంచారని వివరించారు. లక్షలాది మంది రైతుల రుణమాఫీని బీఆర్ఎస్ ఎగ్గొడితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షలలోపు రుణాలను మొత్తం రూ.21 వేల కోట్లు మాఫీ చేసి 25 లక్షల మంది రైతులకు సహాయపడిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో పంట బీమా లేకపోవడంతో రైతులు నష్టపోగా, కాంగ్రెస్ ప్రభుత్వం 42 లక్షల మంది రైతులకు బీమా కవరేజీ కోసం రూ.1,433.33 కోట్ల ప్రీమియం చెల్లించిందని వివరించారు. కాంగ్రెస్ అధికారికంగా రూపొందించిన విగ్రహంపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం హాస్యాస్పదమని కొట్టిపారేశారు.

# కార్పొరేట్ విద్యావిధానాన్ని నియంత్రించాలి

**– కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా విధానాన్ని ప్రోత్సహించాలి**
**– టీఎస్‌యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా మహాసభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి**




షాద్ నగర్: కార్పొరేట్ విద్యా విధానాన్ని నియంత్రించాలని, అలా జరిగినప్పుడే పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్య అందే అవకాశం ఉంటుందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఠాగూర్ హైస్కూల్ ఆడిటోరియంలో జరిగిన సంఘం జిల్లా మహాసభల్లో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు పూర్తయినా ఇంకా ఎంతో మంది నిరుపేదలు చదువుకు దూరంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఎంతోమంది తల్లిదండ్రులు కూటికి లేకున్నా తమ పిల్లలకు కార్పొరేట్ స్కూళ్లలో చదివించాలని తాపత్రయపడుతున్నారని తెలిపారు. అలాంటి విద్యా విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించడం విడ్డూరంగా ఉందన్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, పేస్కేల్ విడుదల చేయాలన్నారు. 317 జీవోతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా గోపాల్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా ఎం వెంకటప్ప ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శులుగా నర్సింలు గౌడ్, శివారెడ్డి, వెంకటయ్య, కిషన్ చౌహన్‌తో పాటు 93 మంది జిల్లా కమిటీ సభ్యులుగా 17 మంది జిల్లా ఆఫీస్ బేరర్స్‌గా ఎంపికయ్యారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**– మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట : పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క**
**– సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు అందిస్తాం : వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**
**– వికారాబాద్ జిల్లాలో మంత్రుల పర్యటన**



దోమ: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. వికారాబాద్ జిల్లాలో పర్యటించిన మంత్రులు.. పరిగి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం, పలు అభివృద్ధి, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పరిగి మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా పరశురామ్ రెడ్డితోపాటు పాలక మండలి సభ్యులు, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా బీఎస్ ఆంజనేయులు ముదిరాజ్‌తోపాటు పాలకవర్గ సభ్యులు మంత్రుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. కుల్కచర్ల మండలంంలోని బండవెల్కిచెర్ల పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికీ మంత్రులు హాజరయ్యారు. అలాగే పరిగి పట్టణకేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సీఎం కప్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశాల్లో మంత్రులు మాట్లాడారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒకదాని వెంబడి ఒకటి అమలు చేస్తున్నామని అన్నారు. రైతు కూలీలకు ఇచ్చిన హామీలు కూడా తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు. ఏకకాలంలో రుణమాఫీ చేశామని, త్వరలోనే రైతు భరోసా రైతుల ఖాతాలో జమవుతుందని తెలిపారు. ఆర్టికల్చర్‌తోపాటు ఆయిల్ ఫామ్ మీద కూడా దృష్టి పెట్టినట్టు చెప్పారు. రైతులు వ్యవసాయం చేయడంతో పాటు తమ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. శీతల గిడ్డంగులను నిర్మించనున్నట్టు తెలిపారు. అదేవిధంగా పండించిన పంటలను హోల్ సేల్ మార్కెట్‌లో విక్రయించేందుకు కోహీడ వద్ద మార్కెట్‌ను సన్నద్ధం చేస్తున్నట్టు చెప్పారు. జిల్లాకు త్రిబుల్ ఆర్ రోడ్డు రావడం వల్ల భూములకు భారీగా డిమాండ్ పెరుగుతుందని, కాబట్టి రైతులెవరూ భూములను అమ్ముకోకూడదని సూచించారు. పార్టీలో కష్టపడిన వారికి సరైన గుర్తింపు లభిస్తుందన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. వ్యవసాయ శాస్త్రవేత్తలుగా రైతన్నలు ఉన్నారని, కందులకు తాండూర్ ఫేమస్ అని అన్నారు. పంటల మార్పిడి కూడా అవసరమని అన్నారు. మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో రైతులే రాజులు, మహిళలే మహారాణులని అన్నారు. అందరి సహకారంతో ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకొచ్చి ముందుకు సాగుతుందని తెలిపారు. ఛీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రాణహిత ప్రాజెక్టు, రైల్వే లైన్ పరిగికి తీసుకువచ్చే క్రమంలో గత ప్రభుత్వం రాకుండా అడ్డుకుందన్నారు. ఇప్పుడు రైల్వే ప్రాజెక్టు సంబంధించి సర్వే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ రాజేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక నుంచి రాష్ట్రంలోకి తరలిస్తున్న ధాన్యం లారీలు సీజ్..



క్రిష్ణా : కర్ణాటక నుంచి ఎలాంటి ఆధారాలు లేకుండాగా రాష్ట్రానికి తరలిస్తున్న వరి ధాన్యం లారీలను సీజ్ చేసినట్లు ఎన్ఫోర్స్మెంట్ డిటి గురురాజ రావు తెలిపారు. నారాయణపేట జిల్లా క్రిష్ణా మండల పరిధిలోని కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ఉన్న చేగుంట గ్రామం వద్ద జాతీయ రహదారి 150 పక్కన ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్ వద్దా శుక్రవారం రాత్రి 2:30 గంటలకు రాష్ట్రంలోకి వస్తున్న 6 వరి ధాన్యపు లారీలను అక్కడ ఉన్న చెక్ పోస్ట్ అధికారులు తనిఖీలు చేసి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కృష్ణ పోలీస్ స్టేషన్ కు ధాన్యపు లారీలను తరలించి అదుపులోకి తీసుకున్నారు, ఈ సందర్భంగా ఎన్ఫోర్స్మెంట్ డిటి గురురాజ రావు ఆదివారం పరిశీలించగా 6 లారీలలో అందజుగా 2 వేల 4 వందల 30 బస్తాల ధాన్యం ఉన్నాయని ఇట్టి వరి ధాన్యానికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు చూపియకపోవడంతో సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 బోనస్ వరి పండించిన రైతులకు ప్రకటించడంతో పక్క రాష్ట్రాల దళారులు రాష్ట్రంలోకి అక్రమంగా తరలిస్తున్నారని, ఎలాంటి ఆధారాలు లేకుండా రాష్ట్రంలోకి వస్తున్న వరి ధాన్యపు లారీలను చెక్పోస్ట్ వద్ద అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి వదులుతున్నారని అక్రమానికి పాల్పడిన వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు.

# పాతబస్తీ మెట్రో భూసేకరణ పనులు ముమ్మరం

**– 1100 ప్రభావిత ఆస్తులు సేకరణ చకచకా..**
**– నెలఖారులోగా 200 ప్రభావిత ఆస్తులకు పరిహారం చెల్లింపు**
**– పనుల ప్రగతిపై ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి సమీక్ష**



సిటీ: ఓల్డ్ సిటీలో మెట్రో రైల్‌ను త్వరగా పట్టాలు ఎక్కించడానికి సంబంధించిన స్థల సేకరణ ప్రక్రియ వేగవంతమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు దాదాపు 7.5 కిలోమీటర్ల నిడివి గల ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట మార్గంలో భూసేకరణ పనులు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే గుర్తించిన 1100 ప్రభావిత ఆస్తుల సేకరణ చకచకా సాగుతోంది. భూసేకరణ చట్టానికి లోబడి ఈ ప్రభావిత 1100 ఆస్తులకుగాను ఇప్పటికే 900 ఆస్తులకు సంబంధించిన రిక్విజిషన్‌ని జిల్లా కలెక్టర్‌కి సమర్పించామని, వాటిలో 800 ఆస్తులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను దఫదఫాలుగా కలెక్టర్ జారీ చేశారని హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్(హెచ్ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. నోటిఫై చేసిన ఆస్తుల్లో 400 ఆస్తులకు ప్రిలిమినరీ డిక్లరేషన్‌ను కలెక్టర్ జారీ చేయడం పూర్తయ్యిందని చెప్పారు. 200 ప్రభావిత ఆస్తుల పరిహారానికి సంబంధించిన అవార్డులను ఈ నెలాఖరులోగా ప్రకటించి, వెంటనే వాటికి పరిహారం చెల్లించి వాటిని కూల్చే పనులూ ప్రారంభమవుతాయని అన్నారు. తద్వారా మెట్రో రైల్ మార్గ నిర్మాణాన్ని సుగమం చేయనున్నట్టు స్పష్టం చేశారు. ఈ మార్గంలో ఉన్న వివిధ నిర్మాణాలు, ప్రభావిత ఆస్తుల యాజమానులతో సానుకూలంగా చర్చించి, వాటిని భూసేకరణ చట్టం ప్రకారం సేకరించి రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. రోడ్డు విస్తరణ, మెట్రో నిర్మాణంలోనూ మతపరమైన, చారిత్రక కట్టడాలన్నింటినీ తప్పించి వాటిని ఇంజినీరింగ్ సొల్యూషన్లతో పరిరక్షిస్తున్నామని తెలిపారు. మెట్రో రైల్ రాకతో పాత నగరం ఎంతో ఆకర్షణీయ ప్రాంతంగా రూపుదాల్చుకోనుందన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగు కావడమే కాకుండా, కాలుష్య రహితంగా ఈ ప్రాంతమంతా గొప్ప అభివృద్ధి సాధించనున్నదని తెలిపారు. ముఖ్యమంత్రి ఇక్కడి మెట్రో రైల్ మార్గం విషయంలో అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కాగా, మెట్రో భూసేకరణ ప్రక్రియపై హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నిరంతరం సమీక్షిస్తూ పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రికి వివరిస్తున్నారు.

# విద్యార్థుల ఆరోగ్యం, ఎదుగుదలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**ఎస్పీ అఖిల్ మహజన్**

రాజన్న సిరిసిల్ల: దూమల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ లో కామన్ డైట్ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ
ఒత్తిడి నుండి దూరం కావడానికి యోగా, మెడిటేషన్ అలవర్చుకోవాలి.
విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసిన జిల్లా ఎస్పీ
తరగతి గదులు కలియతిరిగి, విద్యార్థులతో ముచ్చటించి సమస్యలపై ఆరా, ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. ప్రతి హాస్టల్లో ఒకే రకమైన భోజనం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కామన్ డైట్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. గతంలో ఉన్న డైట్ చార్జీలు 8 సంవత్సరాల తర్వాత 40 శాతం ప్రస్తుత ప్రభుత్వం పెంచిందని, కాస్మోటిక్ చార్జీలను 16 సంవత్సరాల తర్వాత 200 శాతం పెంచిందన్నారు. పాఠశాలలో చదివే విద్యార్థుల ఎదుగుదల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం అత్యంత శ్రద్ధ వహిస్తుదన్నారు. విద్యార్థిని విద్యార్థులు చిన్నతనంలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటి సాధనకు నిరంతరం కష్టపడాలని సూచించారు. కష్టపడితే ఏదైనా సాధించవచ్చని అందరూ తమ లక్ష్యాలను చేరుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఒత్తిడి నుండి దూరం కావడానికి యోగ మెడిటేషన్ వంటివి అలవర్చుకోవాలి, విద్యార్థి దశలో సోషల్ మీడియా, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని, వాటి వలన జీవితాలు నాశనం అవుతాయన్నారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఎస్పీ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృదం, ఎల్లారెడ్డిపేట్ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ రమాకాంత్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని రక్షించుకోవటం తక్షణ కర్తవ్యం

**– దానికి ప్రమాదం వచ్చిపడింది**
**– మతాధారిత రాజ్యాంగం తప్పు**
**– అది దేశ ఐక్యతకు విఘాతం : ఎం.ఎ.కె దత్ వర్థంతి సభలో బీవీ రాఘవులు**



హైదరాబాద్: రాజ్యాంగాన్ని రక్షించుకోవటమే తక్షణ కర్తవ్యమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) సీనియర్ నాయకుడు ఎం.ఎ.కె దత్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి చావ రవి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాఘవులు స్మారకోపన్యాసం చేశారు. రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మతాధారిత రాజ్యాంగం తప్పని చెప్పారు. దాంతో దేశ ఐక్యతకు విఘాతమేర్పడుతుందని వివరించారు. ఎవరి మత విశ్వాసాలు వారికున్నాయనీ, ఒక మతం మరో మతాన్ని తక్కువ చేయటం తగదన్నారు. భారతీయులు విశ్వమానవులనీ, వారిని ఒక్కటిగా ఉంచగలిగేది రాజ్యాంగమేనన్నారు. ఎం.ఎ.కె దత్ విశ్వమానవుడని కొనియాడారు. లౌకికవాది, మానవతావాది, సమతావాది. కులం, మతం, ప్రాంతం, రంగులకు అతీతంగా సమానత్వం కోరుకున్నారన్నారు. వారు విశ్వమానవులు కనుకనే ఆయన అస్థిత్వం విశ్వమానవ లక్షణంతో ఉందని గుర్తు చేశారు. మన అస్థిత్వం భారతీయతని చెప్పారు. భారతీయులందరికీ సమాన మైన హక్కులుండాలన్నారు. రాజ్యాంగంపై పార్లమెం టులో చర్చ జరుగుతున్న నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడితే, బీజేపీ రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నదని చెప్పారు. ప్రపంచంలో ఎలక్టోరల్ డిక్టేటర్ షిప్ అనే కొత్త సంస్కృతి తెరపైకి వచ్చిందనీ, అది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. ఒకే దేశం–ఒకే ఎన్నిక కూడా నియంతృ త్వానికి దారి తీస్తుందని చెప్పారు. రాజ్యాంగ లక్ష్యాలైన ప్రజా స్వామ్యం, లౌకికవాదం, సమాఖ్య వాదం, సామాజిక న్యాయం, సామ్యవాదం కాపాడటమే తక్షణ కర్తవ్యమన్నారు. మతం వ్యక్తిగతమనీ, దానిలో రాజ్యం జోక్యం ఉండకూడదన్నారు. పెట్టు బడిదారీ సమాజంలో అసమానతలు పెరిగాయనీ, ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థపట్ల వ్యతిరేకత పెరుగుతున్నదని వివరించారు. సామ్య వాద భావనకు మద్దతు పెరుగుతుందని తెలిపారు. తొలుత దత్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్, సీఐటీయూ ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య, టీఎస్ యూటీఎఫ్ సీనియర్ నాయకులు పి మాణిక్ రెడ్డి, ఎం నరహరి, సి కమల కుమారి, రాష్ట్ర నాయకులు సింహాచలం, కొండలరావు, పౌరస్పందన వేదిక కార్యదర్శి రాధేశ్యామ్, పద్మశ్రీ, టీఎస్ యూటీఎఫ్ జిల్లాల నాయకు లు పలువురు ఉపాధ్యాయులు, దత్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల బాధితులకు రూ.33.27 కోట్లు వాపస్

**– మెగా లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం : సీఎస్‌బీ డీజీపీ షికా గోయెల్**




సైబర్ నేరస్థుల నుంచి స్వాధీనపర్చుకున్న రూ.33.27 కోట్లను బాధితులకు వాపస్ చేయటం జరిగిందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) డీజీపీ షికా గోయెల్ తెలిపారు. ఈ మొత్తం కూడా ఈనెలలో సైబర్ నేరస్థుల మోసాలకు లోనైన బాధితులకు సంబంధించినవని ఆమె చెప్పారు. గత నెలలో రూ.27 కోట్లను సైబర్ నేరాలకు గురైన బాధితులను గుర్తించి అప్పగించటం జరిగిందన్నారు. కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు సైబర్ నేరగాళ్ల మోసాలకు గురైన దాదాపు 17 వేల మందికి పైగా బాధితులకు నేరస్థుల నుంచి స్వాధీనపర్చుకున్న రూ.155 కోట్లను వాపస్ చేయటం జరిగిందని ఆమె తెలిపారు. ఇక ఈనెల 14న జరిగిన మెగా లోక్ అదాలత్ ద్వారా లక్షా యాభైవేల కేసులలో పరస్పర పరిష్కారాన్ని వారి అంగీకారం ద్వారా చూపెట్టటం జరిగిందనీ, ఇందులో విభిన్న కేసులున్నాయని చెప్పారు.

# రైతులకు బేడీ తలనొప్పి..

హైదరాబాద్: గత ఖమ్మం జిల్లాలో రైతులకు బేడీలు వేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. 2023 ఎన్నికల్లో దాని ప్రభావం కనిపించింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అలాంటి చర్యలకు దిగడం విమర్శలకు తావిస్తోంది.దేశానికి అన్నం పెట్టేది రైతులే. కానీ, రైతులకు.. వారి శ్రమకు గుర్తింపు, ఫలితం దక్కడం లేదు. ప్రభుత్వాల తీరుతో ఇబ్బంది పడుతున్నారు. దళారుల తీరుతో మోసపోతున్నారు. ఇటీవల రైతుల భూములు తీసుకోవడం ఉద్రిక్తతలకు దారితీస్తోంది. మల్లన్న సాగర్ భూసేకరణ సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను, గ్రామస్తులను పోలీసులతో నిర్బంధించి భూములు లాక్కుంది. తాజాగా కాంగ్రెస్ వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా సిటీ కోసం భూసేకరణకు సిద్ధమైంది. ఈ సమయంలో రైతులు అధికారులపై తిరగబడ్డారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా పట్నం మహేందర్‌రెడ్డి ఉన్నారు. పలువురు రైతులను పోలీసులు అరెస్టు చేశారు. అయితే జైల్లో ఉన్న రైతులను బేడీలు వేసి తీసుకురావడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశ మైంది. తాజాగా హీర్యానాయక్‌ను జైలు నుంచి సంకెళ్లతో ఆస్పత్రికి తరలించారు. విమర్శలు రావడంతో జైలర్ సంజీవరెడ్డిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సూపరింటెండెంట్ సంతోష్‌పై శాఖాపరమైన చర్యలకు జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్తాకు లేఖ రాశారు. హీర్యానాయక్ గురువారం ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పడంతో పోలీసులు సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.ఈ సమయంలో ఆయనకు బేడీలు వేసి ఉండడం, ఆ పొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఫైరల్ అయ్యారు. ఘటనపై ఆరా తీశారు. సంకెళ్లు ఎందుకు వేశాలరని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించారు. దీంతోరంగంలోకి దిగిన మల్టీజోన్?2 ఐజీ సత్యనారాయణ సంగారెడ్డికి వెళ్లి విచారణ చేపట్టారు.లగచర్ల ఘటన తర్వాత పలువురు రైతులను పోలీసులు అరెస్టు చేశారు. అందులో హీర్యానాయక్ కూడా ఉన్నారు. న్యాయస్థానం వారికి రిమాండ్ విధించింది. దీంతో సంగారెడ్డిజైలుకు తరలించారు. బుధవారం ఛాతీలో నొప్ప రావడంతో జైలు అధికారులు ఎస్కార్ట్‌తో ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల తర్వాత జైలుకు తరలించారు. గురువారం మళ్లీ నొప్పగా ఉందనడంతో మరోమారు గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ సమయంలో చేతికి సంకెళ్లు ఉండడంతో కొందరు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు.ఇదిలా ఉంటే.. హీర్యానాయక్‌ను ఆస్పత్రికి తరలించేందుకు సిబ్బందిని పంపించాలని జైలు సూపరింటెండెంట్ రాసిన లేఖలో పలు అంశాలు కలకలం రేపాయి. వాటిపై నిఘావర్గాలు ఆరాతీస్తున్నాయి. సాధారణంగా ఏసు నమోదు చేసిన పోలీసులు ఎస్కార్ట్ అడగాలి. కానీ, సూపరింటెండెంట్ వికారాబాద్ పోలీసులను కాకుండా సైబరాబాద్ పోలీసులకు లేఖ రాశారు. అందులో బాలానగర్ పీఎస్‌లో కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. ఆ కేసు రోడ్డు ప్రమాదానికి సంబంధించినంది.ఇదిలా ఉంటే లగచర్ల కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న సురేశ్ ఫోన్‌లో మాట్లాడిన విషయం కూడా బైయటకు వచ్చింది. దీనిపై జైలర్ జీవన్‌రెడ్డిని డీజీ సస్పెండ్ చేశారు. ఏ2గా ఉన్న సురేశ్ ల్యాండ్ ఫోన్ నుంచి ఎవరితోనో మాట్లాడారిని మల్టీజోన్2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. ఫోన్‌లో గుండెనొప్పి అని లాయర్లు, మీడియాకు సమాచారం ఇస్తే గంటలో బెయిల్ ఇస్తామని తెలిపాడు. సూపరింటెండెంట్ లేఖపైనా విచారణ జరుపుతున్నారు.

# సంక్రాంతికి విస్తరణ పక్కా..

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచింది. కేబినెట్ 12 మందితో ఏర్పడింది. ఆరు పోస్టులు ఇంకా ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా వాటి భర్తీకి లైన్ క్లియర్ అయింది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయింది. ఈ నేపథ్యంలో క్యాబినెట్ బెర్తుల ఖాళీలు భర్తీ చేసేందుకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో కసరత్తు మొదైలంది. కాంగ్రెస్ మార్కు రాజకీయాలు రాష్ట్రంలో ఊపందుకున్నాయి. తాజాగా ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ విస్తరణ కోసం అనుమతి తీసుకున్నారు. ఆరుగురి పేర్లు ఖరారు చేసుకుని వస్తారని తెలుస్తోంది. దీంతో ఆశావహులు అలర్ట్ అయ్యారు. మరోవైపు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కూడా మరో జాబితాతో ఢిల్లీ వెళ్లారు. ఆయన ప్రధానంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో పాటు మరికొంతమంది కోసం లాబీయింగ్ చేస్తున్నారు. మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా భట్టిని కలిశారు. తన పేరు సిఫారసు చేయాలని కోరారని సమాచారం.ఇదిల ఉంటే.. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఢిల్లీలో రచ్చ చేశారు. పార్టీలో పాత వారికన్నా కొత్తవారికి ప్రాధాన్యం ఇస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస మున్షికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్‌ను చంపేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు మంత్రి పదవి ఆశిస్తున్న పలువురు హస్తిన బాట పట్టారు. సామాజిక సమీకరణలకు కేబినెట్‌ల్‌లో ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది.కేబినెట్ బెర్తుల భర్తీలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి కూడా కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆమె కూడా కొందరి పేర్లు సిఫారసు చేశారని సమాచారం. సీనియరుల, సీఎం, ఇన్‌చార్జి తమ తమ పేర్లతో ఢిల్లీ చేరుకున్నారు. ఇప్పుడు ఎవరి జాబితాకు హైకమాండ్ ఆమోదం తెలుపుతుందన్న టెన్షన్ నెలకొంది. మరోవైపు కేబినెట్ విస్తరణకు నల్గొండ నేతలు అడ్డు పడుతున్నట్లు తెలిసింది. నల్గొండ జిల్లా నుంచి ప్రస్తుత ఏబినెట్‌లో ఒకే సమాజికవర్గం నేతలు ఉన్నారు. కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రులుగా ఉన్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కూడా ప్రయత్నం చేస్తున్నారు. ఈనేపథ్యంలో కేబినెట్ విస్తరణను ప్రభావితం చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఉమ్మడి నల్గొండ జిల్లా ఎమ్మెల్యేలు కూడా కారణం. ఈ నేపథ్యంలో అధిష్టానం కూడా ఈ విషయంపై దృష్టిసారించింది. మరోవైపు తాజా విస్తరణలో హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు ప్రాధాన్యం దక్కే అవకాశం ఉంది.

# రీజనల్ రింగ్ రోడ్డుకు మహర్ధశ

హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధిలో హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు సూపర్ గేమ్ ఛేంజర్ అని ప్రభుత్వ పెద్దలు వెల్లడిస్తున్నారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సగం తెలంగాణ అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డు నుంచి సుమారు 40 కి.మీ దూరం నుంచి ఈ ప్రాజెక్టును ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఉత్తర, దక్షిణ భాగాలుగా ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఉత్తర భాగం భూసేకరణ దాదాపు పూర్తయింది.తెలంగాణ మణిహారంగా చేపడుతున్న రీజినల్ రింగు రోడ్డుపై కీలక అప్డేట్ వచ్చింది. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి (159 కి.మీ.) అవసరమైన సాంకేతిక, ఆర్థికపరమైన అనుమతులు వెంటనే ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి గడ్కరీతో సమావేశమైన సీఎం రాష్ట్రానికి సంబంధించి పలు జాతీయ రహదారులు, ఇతర రహదారుల వివరాలను తెలియజేసి సత్వరం అనుమతులు మంజూరు చేయాలని కోరారు.2017లోనే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని 161 ౦౦ జాతీయ రహదారిగా ప్రకటించిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ రహదారి నిర్మాణానికి అవసరమయ్యే భూమిలో 94 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేకరించిందని చెప్పారు. మిగిలినవి కూడా పూర్తి చేస్తామమని త్వరతిగతిన పనులు ప్రారంభించేందుకు ఆర్థిక పరమైన అనుమతులు ఇవ్వాలని కోరారు. అందుకు గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు సీఎంవో వర్గాలు వెల్లడించాయి.ఇక దక్షిణ కాశీగా గుర్తింపు పొందిన శ్రీశైలంను హైదరాబాద్ నగరంతో అనుసంధానించే ఔఊ-765లో 125 కిలోమీటర్ల దూరం జాతీయ రహదారుల ప్రమాణాలతో ఉందని, మిగిలిన 62 కిలోమీటర్లు అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో ఉందని చెప్పారు. ఆ ప్రాంతంలో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని,అందుకు 2024-25 బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తే హైదరాబాద్ ఏపీలోని ప్రకాశం జిల్లా మధ్య 45 కిలోమీటర్ల దూరం తగ్గతుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్య నగరాలైన హైదరాబాద్-విజయవాడ (ఎన్.హెచ్-65) రహదారిని 6 వరుసలుగా విస్తరించే పనుల డీపీఆర్‌ను త్వరగా పూర్తి చేయాలని కోరారు.పర్వత్ మాల ప్రాజెక్ట్‌లో యాదగిరి గుట్ట దేవాలయం, నల్గొండ పట్టణంలోని హనుమాన్ కొండ, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ వద్ద రోప్ వేలను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. గోదావరి, కృష్ణా నదులపై గిరిజనులు అత్యధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో.. ప్రజా రవాణాకు ఇబ్బందిగా ఉన్న 10 చోట్ల పాంటూన్ బ్రిడ్జిలు మంజూరు చేయాల న్నారు. నల్గొండ జిల్లాల్లో ఎన్.హెచ్-65 పక్కన 67 ఎకరాల ప్రభుత్వ భూమిలో ట్రాన్స్ పోర్ట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గారిని కలిసిన వారిలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,పలువురు ఎంపీలు ఉన్నారు.

# సంగారెడ్డి నుంచే యుద్ధ ట్యాంకర్లు...

మెదక్: సరిహద్దుల్లో బాంబుల గర్జనలు చేసే యుద్ధ ట్యాంకర్లు.. సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ చెరువులో ప్రత్యక్షమయ్యాయి. భారీ ఆకారంతో యుద్ధ మైదానాల్లో పరుగులు తీసే ఈ ట్యాంకర్లు చెరువులో పడవల ప్రయాణిస్తూ.. స్థానిక ప్రజల ఆకట్టుకున్నాయి. కొండలు, గుట్టలు, పర్వతాలను అధిరోహించే ఈ యుద్ధ ట్యాంకర్లు ఎందుకు మల్కాపూర్ చెరువులో దిగాయి. ఇక్కడి నీటిలో ఎందుకు చక్కర్లు కొట్టాయో తెలుసుకుందాం..సంగారెడ్డి జిల్లాలోని ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో యుద్ధ ట్యాంకర్లను తయారు చేస్తున్నారు. ఇక్కడ నుంచే వీటిని భారత సైన్యానికి అందిస్తుంటారు. ఇవి దేశం నలుమూలల భారత సైనిక దళాల్లో చేరి విధులు నిర్వహిసుంటాయి. అలాంటి ట్యాంకర్లు కఠినమైన మైదానంలోనే కాకుండా.. నీటిలోనూ ప్రయాణం సాగించేందుకు వీలుగా రూపొందించారు. యుద్ధక్షేత్రాల్లో ఎక్కడైనా కాలువలు, నదులు ఎదురైతే ఆ అడ్డంకులను సులువుగా అధిగమించేలా వీటిని డిజైన్ చేశారు.ఈ కారణంగానే యుద్ధ ట్యాంకర్లను మల్కాపూర్ లోని మైదాన ప్రాంతాలతో పాటు ఇక్కడి చెరువులోనూ ట్రైయల్ రన్ నిర్వహించారు. నీటిలో ప్రయాణించేటప్పుడు ఇవి ఏ తీరుగా పనిచేస్తున్నాయో శాస్త్రవేత్తల బృందం పరీక్షించింది. ఈ సమయంలో యుద్ధ ట్యాంకర్లు, వాటి విన్యాసాలను వీక్షించేందుకు స్థానిక ప్రజలు గుమ్మిగుడారు. వీటి విన్యాసాలు ప్రయాణాన్ని చూసి స్థానికులు ఆశ్చర్యపడ్డారు.ఎద్దుమైలాపూర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో తయారైన ఈ యుద్ధ ట్యాంకర్.. ఒక్కొక్కటి 14.5 టన్నుల బరువుతో రూపొందించారు. ఈ ట్యాంకర్ పై ఒకేసారి పదిమంది ప్రయాణం చేసే అవకాశం ఉంది. నేల మీదే కాకుండా నీటిలో ప్రయాణించే సమయంలోనూ ఈ ట్యాంకర్ పై పదిమంది ప్రయాణించవచ్చని చెబుతున్నారు. ట్రయల్ రన్ సమయంలోను ట్యాంకర్ పై పదిమంది కూర్చుని చెరువులో ప్రయాణించారు.ఇప్పటికే పెద్ద ఎత్తున ఈ తరహా యుద్ధ ట్యాంకుల్ని ఉత్పత్తి చేస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ.. దాదాపు 3500 ట్యాంకర్లను భారత సైన్యానికి అందించింది. మరిన్ని ట్యాంకర్లను రూపొందిస్తూ సైనిక దళాలను పటిష్టం చేయడంలో విరామం లేకుండా కృషి చేస్తోంది ఎద్దుమైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ. ఇక్కడ తయారవుతున్న యుద్ధ ట్యాంకర్లను అనేక పరిస్థితుల్లో, వివిధ ప్రాంతాల్లో పరీక్షిస్తూ.. వాటి సామర్థ్యాలను పరిశీలిస్తుంటారు. వాటిలో ఏవైనా లోటుపాట్లుంటే.. సరిచేసి అప్ గ్రేట్ చేస్తుంటారు. అందుకే ఇక్కడ నిర్వహించిన ట్రయల్ రన్ లకు ప్రత్యేకత ఉంటుంది. పైగా.. ఈ ట్యాంకర్లు యుద్ధ క్షేత్రాల్లో కీలక భూమిక పోషిస్తుంటాయి కాబట్టి.. ఇలాంటి వెహికిల్స్ ఎంత సమర్ధవంతంగా, అత్యాధునికంగా ఉంటే మన సైనిక దళాలు అంత పటిష్టంగా ఉంటాయి.ప్రస్తుతం మల్కాపూర్ చెరువులో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ట్యాంకర్లను.. ఇన్ఫాంట్రీ వెహికల్స్ గా పిలుస్తారని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ అధికారులు వెల్లడించారు. వీటిని యుద్ధ క్షేత్రాల్లో ప్రత్యర్థుల పోస్టులను స్వాధీనం చేసుకున్న తర్వాత సైనికులను, ఇతర సామాగ్రిని వేగంగా తరలించేందుకు వినియోగిస్తారని తెలిపారు.

సంగారెడ్డి జిల్లాలోని ఫ్యాక్టరీ నుంచి వేలాది ట్యాంకర్లను, వివిధ వేరియంట్లల్లో తయారు చేస్తుండగా.. ప్రస్తుతం పరీక్షలు జరుపుకున్న వాటిలో 7 రకాలున్నట్లు పేర్కొన్నారు. వాటిలోఒకదాన్ని ప్రస్తుత ట్రయల్ రన్ లో వినియోగించినట్లు తెలిపారు.

# రాజన్న కోడెలకు రక్షణ లేదా?

## ఆందోళన వ్యక్తం చేసిన భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి నందనం కృపాకర్

హైదరాబాద్: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి చెందిన కోడెలు అంగట్లో సరుకుగా మారడం పట్ల భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆందోళన వ్యక్తం చేసింది. భక్తులు రాజన్నకు సమర్పించిన కోడెల విక్రయాలకు సంబంధించి ఇటీవల వెలుగులోకి వచ్చిన వార్తల పట్లగ్రాఘ్భాంతి వ్యక్తం చేసింది. ఈ అంశంపై సమగ్ర విచారణ జరగాల్సి ఉందని, బాధ్యులైన సిబ్బంది, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్వాభిమాన్ ట్రస్ట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నందనం కృపాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.శ్రీ రాజరాజేశ్వర మందిర గోశాలలో గోమాతకు రక్షణ లేదనే విషయాలను ఇటీవల జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్, వరంగల్ జిల్లా గీసుకొండలో బయటపడ్డ ఉదంతాలు బహిర్గతం చేశాయని ఆయన అన్నారు. ఈ సంఘటనలు రాజన్న భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని అన్నారు. భక్తులు ఎంతో భక్తితో దేవాలయానికి ముడుపుగా చెల్లించిన గోమాతల రక్షణ బాధ్యత నిస్సందేహంగా ఆలయ అధికారులదే అని అన్నారు.ఆలయ గోశాలలోని గోవులకే రక్షణ లేకపోతే వాటికి ఎక్కడ రక్షణ ఉంటుందని ప్రశ్నించారు.జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్, వరంగల్ జిల్లా గీసుకొండ ప్రాంతాలలో గోశాల నిర్వాహకుల పేరిట కొందరు నకిలీ వ్యక్తులు రాజన్న ఆలయ గోవులను తీసుకువెళ్లి విక్రయిస్తూ పట్టుపడ్డ ఉదంతాలపై సంబంధిత పోలీస్ స్టేషన్లో కేసులు నమోదైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రాజన్న ఆలయ గోవుల విక్రయాలపై ప్రతిస్పందించి ఇందుకు కారణమైన దేవాలయ అధికారులపై తగుచర్యలను తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. రాజన్న ఆలయ గోశాల ప్రాంగణాన్ని విస్తరించి, గోవులను రక్షించడానికి కావలసిన ఏర్పాట్లను చేపట్టాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. భక్తుల మనోభావాలను కించపరిచే ఎటువంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని ఆయన దేవాలయ సిబ్బందికి ,ప్రభుత్వానికి, సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలోని అనేక దేవాలయాల అధీనంలోఉన్న గోవులను సంరక్షించి, మెజారిటీ ప్రజల విశ్వాసాన్ని పొందడానికి వెంటనే కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# చుక్కలు చూపిస్తున్న మర్డర్ కేసు

వరంగల్: వరంగల్ నగరంలో హర్రర్ సినిమా తరహాలో జరిగిన ఓ మర్డర్ కేసు పోలీసులకు చుక్కలు చూపిస్తోంది. ఓ వృద్ధురాలిని దారుణంగా హతమార్చిన దుండగులు, సాక్ష్యాధారాలు దొరక్కుండా జాగ్రత్త పడగా? కేసును చేధించేందుకు పోలీసులు తలలు పట్టుకోవాల్సి వస్తోంది. ఇప్పటికే వంద మందికిపైగా అనుమానితులను విచారించినా ఫలితం లేకపోవడంతో ఏడాదైనా వృద్ధురాలి మర్డర్ కేసు మిస్టరీగానే మిగిలిపోయింది. ఈ ఘటన జరిగి ఏడాది అవుతున్న నేపథ్యంలో స్థానికుల్లో ఇప్పుడిదే చర్చ నడుస్తోంది.వరంగల్ ట్రై సిటీలోని కాజీపేట రహమత్ నగర్ కు చెందిన కన్నె విజయ(68) వడ్డీ వ్యాపారం నిర్వహిస్తుండేది. ఆమె భర్త భద్రయ్య అంతకు ఆరు సంవత్సరాల కిందటే చనిపోగా, విజయ తన కొడుకు కన్నె వీరఅశోక్ ఇంట్లో ఉంటూ వడ్డీల వ్యాపారం నడిపిస్తుండేది. ఈ క్రమంలో 2023 డిసెంబర్ 14న ఉదయం 10 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయిన విజయ ఆ తరువాత కనిపించకుండా పోయింది. సాయంత్రమైనా ఇల్లు చేరకపోవడంతో ఆమె కొడుకు, ఇతర కుటుంబ సభ్యులు రాత్రి 12.30 గంటల వరకు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. అయినా ఫలితం లేకపోవడంతో ఇంటికి చేరుకున్నారు.ఈ క్రమంలో అర్ధ రాత్రి 2 గంటల ప్రాంతంలో వారి ఇంటికి కొద్ది దూరంలోని మరో గల్లీలో కుక్కలు విపరీతంగా మొరగడం మొదలు పెట్టాయి. ఒక్కసారిగా కుక్కల శబ్ధం కావడంతో అనుమానం వచ్చిన విజయ కొడుకు వీరఅశోక్, ఇతర కుటుంబ సభ్యులంతా కుక్కల వైపు పరుగులు తీశారు. దీంతో వారికి తమ ఇంటి వైపు ఉన్న ఓ స్ట్రీట్ లైట్ కింద డెడ్ బాడీ కనిపించింది. విజయ మృతదేహం అర్ధనగ్నంగా ఉండగా, ఆమె జాకెట్ కొద్దిదూరంలో ఉన్న డ్రైనేజీ వద్ద రక్తంతో తడిసి ఉంది. విజయ తల వెనుక భాగంతో పాటు కుడి చేతి మధ్య వేలు కూడా పగిలిపోయి ఉన్నాయి. ఆమె ఒంటిపై ఉండాల్సిన రెండు తులాల బంగారం కనిపించకపోవడంతో బంగారం కోసమే ఆమెను హతమార్చి ఉంటారని అనుమానాలు వ్యక్తమయ్యాయి.విజయను హతమార్చిన దుండగులు ఎలాంటి ఆధారాలు చిక్కకుండా చాలా జాగ్రత్త పడ్డారు. డిసెంబర్ 14న ఉదయం విజయ ఇంటి ముందు నుంచి బయటకు వెళ్లిపోగా, ఆ దృశ్యాలు ఆ మార్గంలోని ఓ ఇంటి సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. కానీ ఆమెను హత్య చేసిన దుండగులు ఎలాంటి సీసీ కెమెరాలు లేని, విజయ ఇంటి వెనకవైపు ఉన్న గల్లీ నుంచి వచ్చి డెడ్ బాడీని పడేసి వెళ్లిపోయారు. దీంతో ఆ కాలనీ వ్యవస్థ గురించి తెలిసిన వ్యక్తులే ఈ దారుణానికి పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అంతేగాకుండా విజయను హత్య చేసిన దుండగులు ఆమె ఒంటిపై రక్తపు మరకలు లేకుండా తుడిచేశారు. పోలీస్ డాగ్ స్క్వాడ్ కూడా వాసన పసిగట్టకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతోనే మర్డర్ జరిగిన అనంతరం పోలీస్ శునకాలు ఘటనా స్థలాన్ని పరిశీలించినా ఫలితం లేకుండా పోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి.వడ్డీ వ్యాపారం చేసే విజయ హత్యకు గురి కావడంతో ఆమె వద్ద అప్పు తీసుకున్న వారెవరైనా ఈ హత్య చేసి ఉంటారా అనే అనుమాలు వ్యక్తమయ్యాయి. అంతేగాకుండా పాత కక్షలు, కుటుంబ పరిస్థితులపై కూడా పోలీసులు ఆరా తీసి, మొత్తంగా ఈ కేసులో వంద మందికిపైగా విచారణ జరిపారు. అయినా అసలు ఆమెను చంపింది ఎవరు.. ఎందుకు చంపారనే విషయాలపై మాత్రం క్లారిటీ రాలేదు.నగల కోసం చంపిన వ్యక్తులు మృతదేహాన్ని సీసీ కెమెరాలు లేని మార్గంలో తీసుకు రావడానికి వారికి ఎవరైనా సహకరించారా.. ఆధారాలు దొరకకుండా జాగ్రత్త పడ్డారంటే చంపింది ప్రొఫెషనల్సా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సంచలనం కలిగించిన పెద్ద పెద్ద కేసులనే రోజుల వ్యవధిలో పరిష్కరించి ఎవర్ విక్టోరియస్ గా పేరుగాంచిన వరంగల్ పోలీసులు విజయ మర్డర్ కేసును సాల్వ్ చేయకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాజీపేట పోలీసులు విజయ మర్డర్ కేసును నీరుగారుస్తున్నారనే విమర్శలు వినిపిస్తుండగా, ఒక క్రైమ్ సినిమా తరహాలో జరిగిన ఈ హత్య కేసు మిస్టరీ ఎప్పుడు వీడుతుందో.. అసలు దోషులుగా ఎవరు తేలుతారో చూడాలి.


# 4జీ , 5జీ సెల్యులార్ టెక్నాలజీల మధ్య, ఒక జీ అత్యంత ముఖ్యమైనది

## - ఎవరూ క్యాన్సర్ బారిన పడవద్దు: శ్రీ జిష్ణు దేవ్ వర్మ, గవర్నర్

హైదరాబాద్: గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ యొక్క 11వ వార్షిక నివేదికను ఇతర ప్రముఖులతో కలిసి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ ఆవిష్కరించారు. శుక్రవారం రాత్రి నగరంలోని జూబ్లీహిల్స్ హోటల్ దస్పల్లాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాదారు.క్యాన్సర్ బతికి ఉన్నవారి గురించి ప్రస్తావిస్తూ, క్యాన్సర్ కాంకరర్ అనేది ఉపయోగించడానికి అత్యంత సముచితమైన పదం, మరియు ఇది స్ఫూర్తిదాయకంగా కూడా ఉంది. ప్రభుత్వానికి పరిమిత వనరులు ఉన్నాయి మరియు ప్రైవేట్ సంస్థలకు వారి సవాళ్లు ఉన్నాయి. ఉఅఈ వంటి లాభాపేక్షలేని సంస్థలు ప్రజారోగ్యంలోని అంతరాలను పూడ్చివేసి కీలకపాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. క్యాన్సర్‌తో ఎవరూ బాధపడవద్దు. మేము 3జీ, 4జీ మరియు ఇప్పుడు 5జీ పరిభాష, సెల్యులార్ టెక్నాలజీలను వింటున్నాము. కానీ అతి ముఖ్యమైన జి 'మంచితనం'. మన మంచితనం ద్వారా కనెక్టివిటీని నిర్ధారిద్దాం, అని ఆయన అన్నారు. జీసీఎఫ్ వారి అడుగుజాడలను ఈశాన్య రాష్ట్రాలకు విస్తరించాలని కూడా ఆయన సూచించారు. సపోర్టింగ్ ఆర్గనైజేషన్స్‌ను కూడా అవార్డులతో సత్కరించారు.11వ వార్షిక నివేదికను అందజేస్తూ సీనియర్ కన్సల్టెంట్ రోబోటిక్ సర్జికల్ అంకాలజిస్ట్ మరియు గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి మాట్లాడుతూ క్యాన్సర్ మరణశిక్ష కాదని, ఇది జయించదగిన సవాలు అని అన్నారు. సంవత్సరానికి, జీసీఎఫ్ ఉచిత మొబైల్ స్క్రీనింగ్ ద్వారా లక్ష మంది జీవితాలను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది నాన్-కమ్యూనికేట్ వ్యాధులు. నాణ్యమైన క్యాన్సర్ స్క్రీనింగ్ మరియు చికిత్సను గ్రామీణ వర్గాల ఇంటి వద్దకు తీసుకురావడం, లెక్కలేనన్ని జీవితాలను మార్చడం దీని లక్ష్యం. ఇంకా మాట్లాడుతూ, క్యాన్సర్ భారాన్ని తగ్గించే గొప్ప మిషన్‌తో ఉఅఈ ప్రారంభించబడిందని ఆయన అన్నారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ అని విస్తృతంగా పిలువబడే గ్లోబల్ రీసెర్చ్ అండ్ క్యాన్సర్ ఎడ్యుకేషన్ క్యాన్సర్ ఫౌండేషన్ మానవాళికి 11 సంవత్సరాల సేవను జరుపుకుంది.సహకారాలు మరియు పరిశోధన మరియు ఆవిష్కరణలు ప్రముఖ రచయిత అరుణ్ తివారీ, శ్రీధర్, పోషకుడు మరియు జీసీఎఫ్ ఫౌండేషన్ యొక్క రెండు వందల మందికి పైగా మద్దతుదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విద్యార్థినీలకు పాఠ్య బోధనంలో ఇబ్బందులు కలగొద్దు

క్రిష్ణా : నారాయణపేట జిల్లా క్రిష్ణా మండల పరిధిలోని హిందూపూర్ గ్రామ శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యానిలయాన్ని జిసిడివో పద్మనాలిని, ఎంఈఓ నిజముద్దీన్ సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సమగ్ర శిక్ష ఉద్యోగులు ధర్నాలో ఉన్నందున పాఠశాలలో నెలకొన్న సమస్యలు, భోజన వసతి పై విద్యార్థినీయులను అడిగి తెలుసుకున్నారు. విద్యానిలయంలో విద్యార్థినీయులకు ఏర్పాటు చేస్తున్న వంటలను, కూరగాయలను పరిశీలించి, పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థినీయులకు బోధన విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండగా నాన్ టీచింగ్ ఉపాధ్యాయులను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు డిజిటల్ పాటలను బోధిస్తున్నట్లు తెలిపారు, సమగ్ర శిక్ష ఉద్యోగులు తిరగ పనిలో చేరేవరకు విద్యార్థినీయులకు బోధన విషయంలో ఎలాంటి ఇబ్బందులు



లేకుండా అన్ని ఏర్పాటుతో కూడిన చర్యలను చేపట్టామని ఆమె తెలిపారు, విద్యార్థినీయులకు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు.

# కపిల్ దేవ్ ను అధిగమించిన జస్ప్రీత్ బుమ్రా

**ఆస్ట్రేలియా గడ్డపై వేగంగా 50 వికెట్లు తీసిన ఆసియా/భారత్ బౌలర్‌గా రికార్డు**

**కేవలం 10 మ్యాచ్‌ల్లోనే 50 వికెట్లు తీసిన భారత స్టార్ పేసర్**

**కపిల్ దేవ్ కంటే ఒక మ్యాచ్ ముందుగానే మైలురాయిని అందుకున్న బుమ్రా**




బ్రిస్బేన్‌లోని గబ్బా మైదానం వేదికగా భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న మూడో టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అద్భుత ప్రదర్శన చేస్తున్న విషయం తెలిసిందే. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో కీలకమైన 6 వికెట్లు పడగొట్టి ఆతిథ్య జట్టుని 445 పరుగుల భారీ స్కోరుకు ఆలౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. మొత్తం 28 ఓవర్లు వేసిన బుమ్రా 76 పరుగులు మాత్రమే ఇచ్చి ముఖ్యమైన వికెట్లు తీశాడు. మిగతా బౌలర్లు తేలిపోగా ఆస్ట్రేలియా బ్యాటర్లను భయపెట్టిన ఏకైక భారత బౌలర్‌గా అతడు నిలిచాడు.కాగా, తొలి ఇన్నింగ్స్ తీసిన 6 వికెట్లతో బుమ్రా తన టెస్ట్ కెరీర్‌లో ఏకంగా 12వ సారి ఐదు వికెట్ల ఫీట్‌ను అందుకున్నాడు. ఇక ఆస్ట్రేలియా గడ్డపై అత్యంత వేగంగా 50 వికెట్లు సాధించిన ఆసియా/భారత్ ఆటగాడిగా బుమ్రా చరిత్ర సృష్టించాడు. కేవలం 10 మ్యాచ్‌ల్లోనే ఈ రికార్డును సాధించాడు. అంతకుముందు, భారత్‌కే చెందిన మాజీ క్రికెటర్ కపిల్ దేవ్ 11 మ్యాచ్‌ల్లో ఈ మైలురాయిని చేరుకున్నాడు.ఆస్ట్రేలియా గడ్డపై 10 మ్యాచ్‌ల్లోనే 50 వికెట్లు సాధించిన ఆసియాయేతర ప్లేయర్లలో లాన్స్ గిబ్స్, సిడ్నీ బార్నెస్, హెరాల్డ్ లార్వుడ్, టామ్ రిచర్డ్‌సన్ వంటి దిగ్గజ బౌలర్లు ఉన్నారు. వీరి సరసన తాజాగా బుమ్రా చేరాడు. ఇక ఆస్ట్రేలియా గడ్డపై వేగంగా 50 వికెట్లు తీసిన ఆటగాళ్ల జాబితాలో ఇంగ్లాండ్ మాజీ ఆటగాడు మారిస్ టేట్ అగ్రస్థానంలో ఉన్నాడు. కేవలం 8 మ్యాచ్‌ల్లో 50 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు.

# వర్షం కారణంగా గబ్బా టెస్టు రద్దయితే.. భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుతుందా?

గబ్బా టెస్ట్ రద్దయితే ఆసక్తికరంగా మారనున్న సమీకరణాలు
తదుపరి రెండు టెస్టుల్లో విజయం సాధిస్తే నేరుగా డబ్ల్యూటీసీ ఫైనల్‌కు భారత్
సిరీస్‌ను కోల్పోతే గల్లంతు కానున్న అవకాశాలు
ఆస్ట్రేలియా–శ్రీలంక టెస్ట్ సిరీస్ ఫలితం భారత్‌పై ప్రభావం చూపే ఛాన్స్




వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 సైకిల్‌లో (డబ్ల్యూటీసీ) టెస్ట్ సిరీస్ షెడ్యూల్స్ ముగింపు దశకు చేరుకుంటుండడంతో ఫైనల్‌కు చేరే రెండు జట్లపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుత సమీకరణాల ప్రకారం చూస్తే దక్షిణాఫ్రికా, భారత్, ఆస్ట్రేలియా, శ్రీలంక జట్లు రేసులో ముందు వరుసలో కనిపిస్తున్నాయి. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో దక్షిణాఫ్రికా అగ్రస్థానంలో ఉండగా ఆస్ట్రేలియా, భారత్, శ్రీలంక జట్లు వరుసగా రెండవ, మూడవ, నాలుగవ స్థానాల్లో ఉన్నాయి.

ప్రస్తుతం భారత్–ఆస్ట్రేలియా మధ్య 5 టెస్టు మ్యాచ్‌ల సిరీస్ జరుగుతోంది. సిరీస్‌లో 1–1తో ఇరు జట్లు సమంగా ఉండగా... బ్రిస్బేన్‌లోని గబ్బా వేదికగా ప్రస్తుతం మూడవ టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. అయితే, వర్షం కారణంగా ఈ మ్యాచ్ తొలి రోజు ఆట కొద్ది సమయం మాత్రమే జరిగింది. రెండవ రోజు ఆటకు వాతావరణం అనుకూలించినా, మూడవ రోజు మళ్లీ వర్షం కారణంగా అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఇక రానున్న రెండు మూడు రోజుల్లో కూడా బ్రిస్బేన్‌లో వర్షాలు కురిసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

ఒకవేళ ప్రతికూల వాతావరణం కారణంగా గబ్బా టెస్ట్ పూర్తిగా రద్దైతే డబ్ల్యూటీసీ ఫైనల్ సమీకరణాలు ఏవిధంగా ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది.

గబ్బా టెస్ట్ రద్దైతే సమీకరణాలు ఇవే

వర్షం కారణంగా గబ్బా టెస్ట్ మ్యాచ్ రద్దైనా లేక మ్యాచ్ డ్రాగా ముగిసినా భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరే సమీకరణాలు ఆసక్తికరంగా మారతాయి. మెల్‌బోర్న్, సిడ్నీ వేదికలుగా జరగనున్న తదుపరి రెండు టెస్టుల్లోనూ భారత్ విజయం సాధిస్తే ఇతర ఫలితాలతో సంబంధం లేకుండా భారత్ నేరుగా డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.

ఒకవేళ ఆసీస్‌పై భారత్ 2–1 తేడాతో సిరీస్‌ను గెలుచుకుంటే... ఈ సిరీస్ తర్వాత జరిగే సిరీస్‌లో ఆస్ట్రేలియా చేతిలో శ్రీలంక వైట్‌వాష్‌కు గురికాకుండా ఉంటే సరిపోతుంది. భారత్ ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది.

అదే భారత్–ఆస్ట్రేలియా సిరీస్ 2–2తో డ్రా అయితే మాత్రం ఆసీస్‌పై శ్రీలంక టెస్ట్ సిరీస్ గెలిస్తేనే భారత్‌కు మార్గంసుగుమం అవుతుంది.

అనూహ్యంగా భారత్–ఆసీస్ సిరీస్ 1–1తో సమం అయితే... శ్రీలంక–ఆస్ట్రేలియా సిరీస్ కూడా డ్రా అవ్వాలి లేదా ఆస్ట్రేలియాను శ్రీలంక ఓడించాలి. ఈ సమీకరణాల్లో భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుతుంది.

ఒకవేళ ఆస్ట్రేలియా చేతిలో భారత్ టెస్ట్ సిరీస్‌ను కోల్పోతే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుకునే దారులు మూసుకుపోతాయి.

# బ్రిస్బేన్ టెస్టు.. ముగిసిన మూడోరోజు ఆట.. కష్టాల్లో భారత్

- **బ్రిస్బేన్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడో టెస్టు**
- **మూడోరోజు ఆట ముగిసే సమయానికి భారత్ స్కోర్ 51/4**
- **టాప్ ఆర్డర్ వైఫల్యంతో 44 రన్స్‌కే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ భారత్**
- **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ లో 445 పరుగులకు ఆలౌట్**
- **ఆసీస్ కంటే ఇంకా 394 రన్స్ వెనుకబడి ఉన్న టీమిండియా**




బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో భాగంగా బ్రిస్బేన్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న మూడో టెస్టు మూడో రోజు ఆట ముగిసింది. మొదటి రోజు మాదిరిగానే మూడో రోజు కూడా వరుణుడు ఆటంకం కలిగించడంతో ఎక్కువ ఓవర్ల ఆట సాధ్యపడలేదు. ఇక మూడోరోజు ఆట ముగిసే సమయానికి భారత్ తన మొదటి ఇన్నింగ్స్ లో 4 వికెట్లు కోల్పోయి 51 పరుగులు మాత్రమే చేసింది. ఆసీస్ బౌలర్ల ధాటికి టీమిండియా టాప్ ఆర్డర్ కుప్పకూలింది. భారత జట్టు 44 పరుగులకే నాలుగు కీలక వికెట్లు పారేసుకోవడం గమనార్హం. యశస్వి జైస్వాల్ (4), శుభ్‌మన్ గిల్ (1), విరాట్ కోహ్లీ (3), రిషభ్ పంత్ (9) ఇలా అందరూ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్ 2 వికెట్లు పడగొట్టగా.. కమిన్స్, హేజిల్‌వుడ్ చెరో వికెట్ తీశారు. అంతకుముందు ఆతిథ్య జట్టు తన తొలి ఇన్నింగ్స్ లో 445 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ లో ట్రావిస్ హెడ్ (152), స్టీవ్ స్మిత్ (101), అలెక్స్ కేరీ (70) రాణించారు. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా 6 వికెట్లు పడగొట్టాడు. అలాగే సిరాజ్ 2 వికెట్లు తీయగా... ఆకాశ్ దీప్, నితీశ్ కుమార్ రెడ్డి చెరో వికెట్ సాధించారు. ఇక మూడోరోజు ఆట ముగిసే సమయానికి భారత్ స్కోర్ 51/4 (17 ఓవర్లు). క్రీజులో కేఎల్ రాహుల్ (33), రోహిత్ శర్మ (0) ఉన్నారు. ఆసీస్ కంటే టీమిండియా ఇంకా 394 రన్స్ వెనుకబడి ఉంది.

# జాత్యాహంకార వ్యాఖ్యల వివాదం.. బుమ్రాకు ఇంగ్లాండ్ మాజీ మహిళా క్రికెటర్ క్షమాపణలు

బుమ్రాపై జాత్యాహంకార వ్యాఖ్యలు చేసిన ఇసా గుహ
మూడవ రోజు ఆట ప్రారంభానికి ముందు క్షమాపణలు
బుమ్రాను పొగుడుతూ 'ఎంవీపీ' అని వ్యాఖ్యానించిన ఇసా
చింపాంజీ ప్రధాన పాత్రలో వచ్చిన 'ఎంవీపీ' సినిమాలోని పాత్రతో పోలిక
సోషల్ మీడియాలో విమర్శలతో దిగొచ్చిన ఇంగ్లిష్ వ్యాఖ్యాత




బ్రిస్బేన్ వేదికగా భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న మూడవ టెస్ట్ మ్యాచ్‌కు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ ఇసా గుహ టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను ఉద్దేశించి జాత్యాహంకారం వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అయితే, తన వ్యాఖ్యల పట్ల చింతిస్తూ ఆమె క్షమాపణలు చెప్పారు. ఆట మూడవ రోజు ప్రారంభానికి ముందు 'ఫాక్స్ క్రికెట్' ఛానల్ లైవ్ ప్రోగ్రామ్‌లో ఆమె సారీ చెప్పారు. కామెంటరీలో నేను పలికిన ఒక పదాన్ని విభిన్న సందర్భాలకు అన్వయించవచ్చు. దీని కారణంగా తలెత్తిన తప్పుకి క్షమాపణలు చెబుతున్నాను. ఇతరుల పట్ల గౌరవం, సానుభూతి విషయంలో నన్ను నేను చాలా ఉన్నతంగా ఉంచుకుంటాను" అని ఆమె వెల్లడించారు. కాగా, రెండవ రోజు ఆటలో 5 వికెట్లతో రాణించిన జస్ప్రీత్ బుమ్రాను ఇసా గుహ ప్రశంసలతో ముంచెత్తారు. అయితే, తన వ్యాఖ్యానంలో బుమ్రాను 'ఎంవీపీ'తో పోల్చారు. ఎంవీపీ (మోస్ట్ వాల్యూబుల్ ప్రైమేట్) అనేది ఒక సినిమా పేరు. చింపాంజీ ఒక హాకీ ప్లేయర్‌గా రక్తికట్టించే కామెడీ–స్పోర్ట్స్ మూవీ ఇది. ఎంవీపీ పదాన్ని ఉపయోగించి బుమ్రాను ఒక చింపాంజీతో పోల్చారంటూ సోషల్ మీడియా వేదికగా అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాత్యాహంకార వ్యాఖ్యలు చేశారంటూ ఇసా గుహపై విరుచుకుపడ్డారు. ఈ వ్యవహారంపై రవిశాస్త్రి కూడా స్పందించారు.

అయితే, తొలి ఇన్నింగ్స్‌లో అద్భుతంగా రాణించిన బుమ్రాను పొగిడే సందర్భంలోనే ఈ పదాన్ని తాను ఉపయోగించానని ఇసా గుహా స్పష్టం చేశారు. బుమ్రా బౌలింగ్ నైపుణ్యాల గురించి మాట్లాడుతూ ఈ పదాన్ని ఉపయోగించానంటూ వివరణ ఇచ్చారు. భారత్ తరపున మాట్లాడుకోవాల్సిన ఏకైక ఆటగాడు బుమ్రా మాత్రమేనని చెప్పదలచుకున్నానని, మూడవ టెస్టులో ఎక్కువ దృష్టి పెట్టాల్సిన భారత ఆటగాడు అతడేననే సందర్భంలో చెప్పానని తెలిపారు. తన వ్యాఖ్యలను పూర్తిగా గమనిస్తే భారత గొప్ప ఆటగాళ్లలో ఒకడిగా నిలిచిపోతాడంటూ ప్రశంసించానని ఇసా గుహ పేర్కొన్నారు.

# ఒకే ఏడాది రెండు ట్రోఫీలు.. ఒకే ఒక్కడిగా శ్రేయాస్ అయ్యర్ రికార్డు

- **ఐపీఎల్‌లో కోల్‌కతాకు, ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబైకి ట్రోఫీలు అందించిన శ్రేయాస్**
- **ఆ ఘనత సాధించిన ఒక్కే ఒక్క ఆటగాడిగా రికార్డు**
- **ఐపీఎల్‌లో మూడు జట్లకు సారథ్యం వహించిన మూడో ఆటగాడిగా మరో రికార్డు**





టీమిండియా ఆటగాడు శ్రేయాస్ అయ్యర్ అత్యంత అరుదైన రికార్డును తన పేరున రాసుకున్నాడు. ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు సారథ్యం వహించిన శ్రేయాస్ ఆ జట్టుకు టైటిల్ అందించి పెట్టాడు. తాజాగా నిన్న మరో ఘనత సాధించాడు. 2024–25లో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (ఎస్ఎంటీఏ)లో ముంబైకి సారథ్యం వహించిన అయ్యర్.. జట్టును గెలుపుతీరాలకు చేర్చాడు. బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో ఆదివారం మధ్యప్రదేశ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఐదు వికెట్లతో విజయం సాధించిన ముంబై ట్రోఫీని చేజిక్కించుకుంది. ముంబైకి ట్రోఫీ అందించడం ద్వారా శ్రేయాస్ అయ్యర్ ఖాతాలో అరుదైన రికార్డు వచ్చి చేరింది. కెప్టెన్‌గా ఐపీఎల్, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలను అందుకున్న తొలి కెప్టెన్‌గా శ్రేయాస్ రికార్డులకెక్కాడు. అంతేకాదు, ఈ రెండింటినీ ఒకే ఏడాది అందుకోవడం మరో విశేషం. 49.28 సగటుతో 345 పరుగులు సాధించిన శ్రేయాస్ ఈ టోర్నీలో అత్యధిక పరుగులు సాధించిన నాలుగవ ఆటగాడిగా నిలిచాడు.

మరో ఘనత కూడా.. 30 ఏళ్ల శ్రేయాస్ ఖాతాలో మరో రికార్డు కూడా ఉంది. కోల్‌కతా నైట్ రైడర్స్‌కు శ్రేయాస్ ఈ ఏడాది టైటిల్ అందించినప్పటికీ జట్టు అతడిని రిలీజ్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. దీంతో ఇటీవల జరిగిన మెగా వేలంలో పంజాబ్ జట్టు అతడిని రూ. 26.75 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ వేలంలో ఇది రెండో అత్యధిక ధర.– కాగా, ఐపీఎల్‌లో మూడు జట్లకు సారథ్యం వహించిన తొలి ఆటగాడు కూడా శ్రేయాసే. గతంలో ఢిల్లీ డేర్ కేపిటల్స్‌కు సారథ్యం వహించిన అయ్యర్, కోల్‌కతా నైట్ రైడర్స్‌ను నడిపించాడు. వచ్చే సీజన్‌లో పంజాబ్ జట్టును నడిపించబోతున్నాడు.

# ఎక్కడా బౌలింగ్ చేయొద్దు... బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్ పై ఐసీసీ నిషేధం

షకీబ్ అల్ హసన్ బౌలింగ్ చేయకుండా ఐసీసీ నిషేధం
షకీబ్ బౌలింగ్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్టు గుర్తింపు
అంతర్జాతీయ క్రికెట్, విదేశీ లీగ్ ల్లో ఎక్కడా బౌలింగ్ చేయరాదని స్పష్టీకరణ




అంతర్జాతీయ క్రికెట్ లోనే కాకుండా, విదేశాల్లోని ఏ లీగ్ లోనూ బౌలింగ్ చేయకుండా బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్ షకీబ్ అల్ హసన్ పై ఐసీసీ నిషేధం విధించింది. బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ షకీబ్ అల్ హసన్ బౌలింగ్ యాక్షన్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్టు ఐసీసీ గుర్తించింది. నిబంధనల ప్రకారం 15 డిగ్రీల కంటే ఎక్కువగా మోచేయి వంగితే, దాన్ని బౌలింగ్ గా పరిగణించరు.


గత కొంతకాలంగా లెఫ్టార్మ్ స్పిన్నర్ షకీబ్ బౌలింగ్ యాక్షన్ పై ఫిర్యాదులు రావడంతో, ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు అతడికి బౌలింగ్ టెస్ట్ నిర్వహించింది. ఈ పరీక్షలో షకీబ్ మోచేయి నిబంధనలకు విరుద్ధంగా 15 డిగ్రీల కంటే ఎక్కువగా వంగుతున్నట్టు తేలింది. దాంతో, మొదట అతడిపై ఇంగ్లండ్ బోర్డు నిషేధం విధించింది. అనంతరం ఐసీసీ కూడా అతడిపై వేటు వేసింది.

ఈ విషయాన్ని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కూడా నిర్ధారించింది. ఐసీసీ బ్యాన్ నేపథ్యంలో, జాతీయ క్రికెట్ లోనూ అతడు బౌలింగ్ చేయడానికి అనర్హుడు అని బంగ్లాదేశ్ బోర్డు వెల్లడించింది.

37 ఏళ్ల షకీబ్ అల్ హసన్ ఓ ఆల్ రౌండర్ గా బంగ్లాదేశ్ జాతీయ జట్టుకు విశిష్ట సేవలు అందించాడు. ఇప్పటిదాకా 71 టెస్టుల్లో 37 సగటుతో 4,609 పరుగులు చేశాడు. టెస్టుల్లో 246 వికెట్లు పడగొట్టాడు. 247 వన్డేల్లో 7,570 పరుగులు చేసి, 317 వికెట్లు తీశాడు. 129 అంతర్జాతీయ టీ20ల్లో 2,551 పరుగులు, 149 వికెట్లు నమోదు చేశాడు.

# బ్రిస్బేన్ టెస్టు.. మరోసారి టాప్ ఆర్డర్ విఫలం..

బ్రిస్బేన్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడో టెస్టు
ఆసీస్ తొలి ఇన్నింగ్స్ లో 445 పరుగులకు ఆలౌట్
అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన టీమిండియాకు ఆదిలోనే షాక్
టాప్ ఆర్డర్ వైఫల్యంతో 22 రన్స్‌కే 3 వికెట్లు కోల్పోయిన భారత్




బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో భాగంగా బ్రిస్బేన్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్ లో ఆతిథ్య జట్టు 445 పరుగులకు ఆలౌట్ అయిన విషయం తెలిసిందే. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా 22 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (4) మరోసారి నిరాశపరిచాడు. ఈసారి కూడా మిచెల్ స్టార్క్‌కే తన వికెట్‌ను పారేసుకున్నాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన శుభ్‌మాన్ గిల్ (01) కూడా త్వరగా పెవిలియన్ చేరాడు. అటు విరాట్ కోహ్లీ మరోసారి తన ఫామ్‌లేమిని కొనసాగించాడు. 3 పరుగులే చేసి ఔటయ్యాడు. జోష్ హెజిల్‌వుడ్ బౌలింగ్‌లో ఆఫ్‌సైడ్ అవతల పడ్డ బంతిని ఆడబోయి వికెట్ కీపర్ అలెక్స్ కేరీకి దొరికిపోయాడు. దీంతో భారత్ లంచ్ సమయానికి 3 వికెట్లు కోల్పోయి 22 పరుగులు చేసింది.

# 'నా బ్యాటింగ్ రికార్డు గురించి గూగుల్‌ని అడగండి'..

ఆస్ట్రేలియా, భారత్ మధ్య గబ్బా వేదికగా మూడో టెస్టు జరుగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 445 పరుగులకు ఆలౌటైంది. జస్‌ప్రీత్ బుమ్రా (6/76) అదరగొట్టాడు.

మూడో ఆట ముగిసే సమయానికి భారత్ 51/4 స్కోరుతో కష్టాల్లో ఉంది. కేఎల్ రాహుల్ (33బి), రోహిత్ శర్మ (0బి) నాటౌట్‌గా ఉన్నారు. మూడో రోజు ఆట ముగిసిన అనంతరం బుమ్రా విలేకరులతో మాట్లాడాడు. ఈ సందర్భంగా రిపోర్టర్ అడిగిన ఓ ప్రశ్నకు బుమ్రా ఆసక్తికర రీతిలో సమాధానమిచ్చాడు. గబ్బాలో బ్యాటింగ్ పరిస్థితుల గురించి బుమ్రాకు ఓ ప్రశ్న వేయగా.. టెస్టుల్లో తన బ్యాటింగ్ రికార్డు గురించి గూగుల్‌లో వెతకాలని (నవ్వుతూ) కోరాడు. బుమ్రా ఇచ్చిన చమత్కారమైన సమాధానంతో అక్కడున్న జర్నలిస్టుల ముఖాల్లో నవ్వులు పూశాయి.

బుమ్రా, రిపోర్టర్ మధ్య సంభాషణ సాగిందిలా..

రిపోర్టర్: 'హాయ్, జస్‌ప్రీత్. బ్యాటింగ్‌పై మీ అంచనా ఏమిటి? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పే సరైన వ్యక్తి మీరు కానప్పటికీ గబ్బాలోని పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే జట్టు పరిస్థితి (బ్యాటింగ్) గురించి మీరు ఏమనుకుంటున్నారు?'

బుమ్రా: 'ఇది ఆసక్తికరమైన ప్రశ్న. కానీ, మీరు నా బ్యాటింగ్ సామర్థ్యాన్ని ప్రశ్నిస్తున్నారు. టెస్టుల్లో ఒక ఓవర్‌లో అత్యధిక పరుగులు చేసింది ఎవరో గూగుల్ చేసి చూడండి. ఇది జోకే కానీ, అదే వేరే సందర్భం'.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**